



నెల్లూరు: విద్యుత్ దీపాలంకరణలో ఇరుకళల పరమేశ్వరి ఆలయం



నెల్లూరు నగరంలో విద్యుద్దీప శోభతో కన్యకాపరమేశ్వరి, రాజరాజేశ్వరి అమ్మవార్ల ఆలయాలు



విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న స్టోన్‌హౌస్‌పేట ప్రధాన రహదారి

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

- జిల్లాలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబు
- భక్తుల రద్దీ ఉన్న దేవాలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు
- పారిశుధ్యానికి ప్రాధాన్యం : డీసీ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శరన్నవరాత్రుల ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఈ ఉత్సవాలు సోమవారం (నేటి) నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న దుర్గాదేవీ ఆలయాలు, మహాలక్ష్మీ ఆలయాలు, రామ మందిరాల్లో నవరాత్రి శోభ వెల్లివిరుస్తోంది. దసరా ఉత్సవాలను 9 అలంకారాలు, 9 నైవేద్యాలు, 9 రంగులు, 9 మంత్రాలతో నిర్వహించనున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలోని ఆలయాల్లోనూ, ప్రైవేటు ఆలయాల్లోనూ ఈ ఉత్సవాలు పోటాపోటీగా నిర్వహించనున్నారు. నగరంలోని రాజరాజేశ్వరి ఆలయం, గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి, వాసవీ కన్యకాపరమేశ్వరి, జొన్నవాడ కామాక్షితాయి, కావలి కళుగోళమ్మ, నర్రవాడ వెంగమాంబ ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా ప్రారంభం కానున్నాయి. దసరా వేడుకల కోసం ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతోనూ రంగులతోనూ తీర్చిదిద్దారు. నవరాత్రి నోములకు మహిళలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేయనున్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

దసరా ఉత్సవాల సందర్భంగా దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ మేరకు ఆయా ఈవోలకు సూచనలిచ్చాం. సామాన్య భక్తులకు దర్శనం కల్పించడం, ఉచిత ప్రసాదం, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నాం. భక్తులు రద్దీ ఉండే నగరంలోని రాజరాజేశ్వరి ఆలయం, జొన్నవాడ కామాక్షితాయి ఆలయం, ఇతర ఆలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. రాజరాజేశ్వరి ఆలయంలో ఉచి త ధర్మ దర్శనం కోసం రెండు క్యూలైన్లు రూ.50, రూ.300 ప్రత్యేక దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశాం. రూరల్ ఎమ్మె ల్యే ఆదేశాల మేరకు అంతరాలయ ప్రవేశాన్ని రద్దు చేశాం. అక్టోబరు 2న అమ్మవారి నగరోత్సవం వైభవంగా నిర్వహిస్తాం. 3న భారీ అన్నదానం చేస్తాం. భక్తులంతా దసరా ఉత్సవాల్లో పాల్గొనాలి.

- కే జనార్దన్‌రెడ్డి, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్

జైల్లో చేతివాటం

- ఖైదీని బ్లాక్ మార్చేందుకు నగదు డిమాండ్
- ఫోన్‌పేలో డబ్బు వేయించుకున్న అధికారి, సిబ్బంది
- డిప్యూటీ జైలర్, చీఫ్ హెడ్ వార్డర్ సస్పెన్షన్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కేంద్ర కారాగారంలో అధికారులు, సిబ్బంది చేతివాటం రోజురోజుకు పెరిగిపోతోంది. ఇటీవల ఓ ఉన్నతాధికారి ఫోన్ సంభాషణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. సెంట్రల్ జైలును రౌడీషీటర్లు మద్యస్థాలకు అడ్డాగా మార్చుకున్నారంటూ రౌడీషీటర్ శ్రీకాంత్ విషయంలో స్పష్టమైంది. ఈ క్రమంలో నెల్లూరు సెంట్రల్ జైలులో శిక్ష పడిన ఖైదీని బ్లాక్ మార్చేందుకు ఇద్దరు అధికారులు ఫోన్‌పే ద్వారా నగదు వేయించుకున్నారని ఆ ఖైదీ ఇచ్చిన ఫిర్యాదుతో జైలు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణలో ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ జరిగిన విషయం నిజమేనని తేలడంతో చీఫ్ హెడ్ వార్డెర్ ఐ. హనుమంతరెడ్డి, డిప్యూటీ జైలర్ ఎం. విజయకుమార్‌ను జైళ్లశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.



సోమశిలకు 40వేల క్యూసెక్కుల వరద

అనంతసాగరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం సాయంత్రం 40 వేల క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో 73.321 టీ ఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువకు మూడు క్రస్ట్‌గేట్ల ద్వారా 35 వేలు, పవర్ టెన్నల్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 350, కండలేరుకు 10,450 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో వర్షాలు కురుస్తుండటంతో ఇన్‌ఫ్లో పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

బోధనేతర పనుల నుంచి **విముక్తి కలిగించాలి** 6

సామాన్యులకు ఊరట !

నేటి నుంచి తగ్గనున్న ధరలు

ప్రజలకు ముందే వచ్చిన దసరా, దీపావళి



నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఏ వస్తువు కొన్నా జీఎస్టీ పేరుతో పన్నులు బాదేస్తుంటే.. ఏమీ చేయలేక, ఎవరికీ చెప్పుకోలేని ప్రజలు ఇప్పటి వరకు సతమతమయ్యేవారు. ఉప్పుపప్పు నిప్పు.. ఇలా ఒకటేమిటీ .. గుండుసూది కొన్నా కూడా పన్నులు బాదేశారు. ప్రతినెలా మార్కెట్‌లో వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయేకానీ, తగ్గటం లేదు. ధరల పెరుగుదలతో సతమతమవుతున్న ప్రజలకు జీఎస్టీ రేట్లు తగ్గుతాయనే అంశం కొంత ఊరటనిచ్చింది. దేశవ్యాప్తంగా సోమవారం (నేటి) నుంచి అమల్లోకి రానున్న జీఎస్టీ రేట్ల తగ్గుదల సామాన్యులకు ఉపశమనం కలిగిస్తోంది. దీంతో తమకు దసరా, దీపావళి పండుగలు ముందే వచ్చాయని వారు సంబరపడుతున్నారు.

జీఎస్టీ తగ్గిస్తే వ్యాపారంలో మార్పులు

ప్రస్తుతం జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రభావంతో ధరలు తగ్గాయో లేదో కానీ, వ్యాపారంలో మార్పులు మాత్రం రానున్నాయి. గతంలో వ్యాపారాలు ఒక క్రమబద్ధంగా నడిచేవి. హోల్‌సేల్, రిటైల్ మార్కెట్‌లు ఉండేవి. ప్రస్తుతం సూపర్ మార్కెట్‌లు రావడంతో ధరల తేడాలు వచ్చాయి. హోల్‌సేల్ మార్కెట్ రేట్లకు రిటైల్ మార్కెటు ధరల్లో చాలా వ్యత్యాసం ఉంది.

- దాసా లక్ష్మీనారాయణ, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు

• వ్యాపారుల హర్షం

కందుకూరు : తగ్గించిన జీఎస్టీ దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమల్లోకి వస్తున్న సందర్భంగా పట్టణంలోని వ్యాపారులు, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాగా సోమవారం సాయంత్రం పామూరు రోడ్డులోని రిలయన్స్ సూపర్ మార్కెట్ వద్ద ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్, సీఎం నారా చంద్రబాబు చిత్ర పటాలకు పాలభిషేకం నిర్వహించనున్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, పట్టణంలోని వ్యాపారులు పాల్గొనాలని బీజేపీ నియోజవకర్గ సమన్వయకర్త ఘట్టమేని హరిబాబు, పట్టణ శాఖ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదావు కోరారు.

జీఎస్టీ తగ్గింపు ఇలా..

వస్తువు పేరు	ప్రస్తుతం	కొత్తది
సబ్బులు, టాయిలెట్ సోప్	18	5
మొబైల్ ఫోన్లు	28	18
వంట సామగ్రి	12	5
ఫ్రిజ్, వాషింగ్ మిషన్, ఎయిర్‌కూలర్	28	18
సిగరెట్లు, కూల్ డ్రింక్స్	18-28	40
రేస్‌క్లబ్, కేసినో సేవలు	18-28	40
విద్యార్థి పుస్తకాలు, బ్యాగులు	12	0
వ్యవసాయ యంత్రాలు, డ్రిప్, స్ప్రింక్లర్లు	12	5
దుస్తులు, ఫ్యాబ్రిక్, చిన్న ఫ్యాబ్ వస్తువులు	12	5
గోధుమ, ఆటా, మైదా	5	0
పన్నీర్, పిజ్జా, బ్రెడ్	5	0
వెన్న, నెయ్యి, తదితరాలు	12	5

• ధరలు తగ్గే వస్తువులివే..!

కొత్త జీఎస్టీ రేట్లతో వస్తువుల ధరలు తగ్గనున్నాయి. సబ్బులు, టూత్ పేస్టులు, పాలు, డెయిరీ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఔషధాలు, ఆటోమొబైల్స్, వాషింగ్ పౌడర్లపై జీఎస్టీ తగ్గనుంది. చిన్నకార్లపై పన్ను కొంత తగ్గించగా, ఎలక్ట్రిక్ వాహనాలపై మరింత పన్ను రాయితీ అందనుంది. పిల్లల వస్తువులు, స్కూల్ బ్యాగ్స్‌పై తక్కువ శాతం జీఎస్టీ విధించారు. గృహోపకరణాల వంటి వాటిపై కూడా పన్ను తగ్గనుంది. ఉదాహరణకు నిత్యం వినియోగించే సబ్బులపై ప్రస్తుతం 18శాతం జీఎస్టీ ఉంది. ఇప్పుడు 12శాతానికి తగ్గుతుంది. రూ.50విలువైన సబ్బుపై జీఎస్టీ తగ్గుదల వలన రూ. 2 నుంచి రూ.3 వరకు తగ్గే అవకాశం ఉంది. మధ్య తరగతివారు చిన్న కార్లను వినియోగించుకోడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. చిన్న కార్లపై ఇప్పటి వరకు 22 శాతం జీఎస్టీ ఉంది. దీని వల్ల రూ.7లక్షల కారుపై సుమారు రూ.35వేల వరకు తగ్గే అవకాశం ఉంది. పాలు, కూరగాయలు భద్రపరచుకునే ఫ్రిజ్‌లపై 18శాతంగా ఉన్న జీఎస్టీ 12శాతానికి తగ్గించారు. దీంతో రూ.20వేల ఫ్రిజ్‌పై రూ. 1200 వరకు తగ్గే అవకాశం ఉంది. మైక్రోవేవ్ ఓవెన్‌పై 18శాతం జీఎస్టీ ఉంటే అది 12 శాతానికి తగ్గింది. దీంతో రూ. 10వేలు ఉన్న ఓవెన్‌పై రూ. 600 తగ్గవచ్చు. వాషింగ్ మిషన్‌పై వున్న 18శాతం జీఎస్టీ 12 శాతానికి తగ్గటంతో రూ. 15వేల విలువైన వాషింగ్ మిషన్‌పై రూ. 900 తగ్గవచ్చు.

వైద్యశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న బాధితులు (ఇన్‌సర్ట్) పసికందు మృతదేహం



కాన్పుకు వస్తే... పసిగుడ్డు ప్రాణం తీశాడు !

- వైద్యుడి నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యుల ఆగ్రహం
- న్యాయం చేయాలంటూ బైఠాయింపు
- ఆసుపత్రి గేటుకు తాళం వేసేందుకు యత్నం

- బాధితులు, పోలీసుల మధ్య వాగ్వివాదం
- ఉదయగిరిలో ఉద్రిక్తత

ఉదయగిరి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి కాన్పు కోసం వస్తే వైద్యుడు నిర్లక్ష్యంగా వ్యవహరించి, పసికందు ప్రాణాలు తీశాడని కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యశాల వద్ద ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. సేకరించిన వివరాల మేరకు.. సీతారామపురం మండలం బసినేనిపల్లి ఏసీనగర్ కాలనీకి చెందిన ముళ్లపాటి మంజులకు, వైఎస్ఆర్ జిల్లా బద్వేల్‌కు చెందిన గొడుగునూరి చంద్రశేఖర్‌తో ఏడాది క్రితం వివాహమైంది. మంజుల గర్భందాల్చడంతో తల్లి సునీత 20 రోజుల క్రితం బద్వేల్ నుంచి బసినేనిపల్లికి తీసుకువచ్చింది. శనివారం ఆమెకు నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులతో కలిసి 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గైనకాలజిస్టు ఠాగూర్ ఆమెకు పరీక్షలు చేశారు. సాధారణ కాన్పు చేస్తానని కుటుంబ సభ్యులకు తెలిపాడు. ఇబ్బందికరంగా ఉంటే తాము ఎక్కడికైనా వెళతామని, రెఫర్ చేయమని కుటుంబ సభ్యులు అడిగారు. 'అవసరం లేదు, కాన్పు చేస్తా'నని వారికి వైద్యుడు భరోసా ఇచ్చారు. అర్ధరాత్రి సమయంలో మంజులకు నొప్పులు అధికమై ఉమ్మనీరు బయటకు వచ్చింది. దీంతో సిబ్బంది కాన్పు కోసం గదిలోకి తీసుకెళ్లారు. వైద్యశాలలోనే ఓ గదిలో ఉన్న వైద్యుడికి సమాచారం ఇచ్చేందుకు వారు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. దీంతో సిబ్బందే కాన్పు చేయడంతో గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డ శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా ఉండడంతో వైద్యశాలలో పనిచేసే శానిటరీ వర్కర్ డాక్టర్ గదికి వెళ్లి తలుపులు కొట్టగా, వైద్యుడు వచ్చి బిడ్డను పరీక్షించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించాలని చెప్పాడు. 108 వాహనానికి సమాచారం అందించగా, వారు వైద్యశాల వద్దకు చేరుకున్నారు. అనంతరం బిడ్డను పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ చనిపోయాడని కుటుంబసభ్యులు తీవ్ర వాగ్వివాదనకు దిగారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి వైద్యశాలకు చేరుకుని వివరాల సేకరించారు.

• వైద్యశాల వద్ద ఉద్రిక్తత

పసికందు మృతి విషయం తెలుసుకున్న మంజుల కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం ఉదయం వైద్యశాలకు భారీసంఖ్యలో చేరుకున్నారు. పొత్తిళ్లలో బిడ్డను చంపినవాడు ఏడంటూ బూతు పురాణం అందుకున్నారు. వైద్యుడిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితిని గమనించిన సీఐ వెంకటరావు, ఎస్ఐలు ఇంద్రసేనారెడ్డి, శివకృష్ణారెడ్డి సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒకదశలో వైద్యశాల గేటుకు తాళం వేసేందుకు ప్రయత్నించగా పోలీసులు, బాధితుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకొంది. అనంతరం అక్కడే బైఠాయించి వైద్యుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిడ్డ తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బిడ్డ మృతదేహానికి పోస్టుమార్టం కోసం వైద్యుల బృందాన్ని పిలిపించే ప్రయత్నం చేస్తున్నారు.

బతికించే ప్రయత్నం చేశా...

కాన్పు అనంతరం బిడ్డ శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడంతో సీపీఆర్ చేసి బతికించే ప్రయత్నం చేశా. అయినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులను పిలిచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించాలని సూచించా. వైద్యశాలలో పని ఒత్తిడి అధికమైంది. మా నిర్లక్ష్యం వల్ల ఇది జరగలేదు.

- ఠాగూర్, గైనకాలిజిస్టు



జలదంకిలో వర్షానికి తడవకుండా పట్టలు కప్పిన ధాన్యం

ధాన్యం ధరల్లో దగా

- కనీస 'మద్దతు'కు తూట్లు
- పుట్టి రూ.15 వేలకు కొనుగోలు
- ఎకరాకి రూ. 16,520 నష్టపోతున్న రైతులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- పట్టించుకోని పాలకులు

నెల్లూరురూరల్/జలదంకి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎడగారు సీజన్‌లో దళారులు, మిల్లర్ల దోపిడీ మొదలైంది. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను గద్దల్లా తన్నుకుపోతున్నారు. కనీస మద్దతు ధరకు తూట్లు పొడుస్తూ పుట్టి ధాన్యంపై ఏకంగా రూ. 4,720లు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. వర్షాన్ని అడ్డంపెట్టుకుని ధాన్యం రంగు మారిందని చెబుతూ ఎకరాకు దిగుబడి వచ్చే మూడున్నర పుట్టి ధాన్యంపై ఏకంగా రూ. 16,520లు దోచుకుంటున్నారు. అన్నదాతలను ఆదుకోవాల్సిన జిల్లా యంత్రాంగం చోద్యం చూస్తున్నది.

ఈసారి జిల్లాలో సాగునీరు పుష్కలంగా ఉండటంతో ఎడగారులో పూర్తి విస్తీర్ణమంతా రైతులు వరి సాగుచేశారు. నెల్లూరు రూరల్లో కనుపూరుకాలువ, జాఫర్‌సాహెబ్, సర్వేపల్లి, కృష్ణపట్నం, లేబూరు, కోడూరు కాలువలతోపాటు వివిధ చెరువుల కింద ఆయకట్టు రైతులు కేఎన్ఎం 1638 రకాన్ని అత్యధికంగా సాగు చేశారు. రెండో ప్రాధాన్యత పంటగా ఎంటీయూ 1010 పండించారు. ప్రస్తుతం వరిపైరు కోతకు సిద్ధమైంది. రంగంలోకి దిగిన మిల్లర్లు, దళారులు పొలాల్లోని పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం నెల్లూరు పడమర పల్లెలో కేఎన్ఎం ధాన్యం పుట్టి రూ. 15 వేలకు కొనుగోలు చేసిన మిల్లర్లు, ఎంటీయూ రకాన్ని రూ. 13,500లకే కొన్నారు.

• కొనుగోలు కేంద్రాలేవి..?

ఎడగారు సీజన్‌కు కనీస మద్దతు ధరను ప్రకటించిన అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టతనివ్వలేదు. ఏగ్రేడ్ కిందకు వచ్చే కేఎన్ఎం పుట్టి రూ. 19,720లుగా లెక్కకట్టారు. అటు ఎంటీయూ 1010 రకం ఏ గ్రేడ్ కిందకు వచ్చినా, దీన్ని అధికారికంగా ప్రభుత్వం కొనుగోలు చేయదని తేల్చారు. ఇప్పటి వరకు ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు, మిల్లర్లు చెప్పిందే ధర కావడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారు. ఈ క్రమంలో ఎకరాపై రూ.16,520లు నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మినిమం సపోర్టు ప్రైస్ (ఎంఎస్పీ) లెక్క ప్రకారం కేఎన్ఎం ధాన్యం పుట్టి రూ. 19,720లకు కొనుగోలు చేయాల్సి ఉండగా, రూ.15 వేలకు కొంటున్నారు. ఈ లెక్కన పుట్టి పై రూ. 4,720లు రైతులు నష్టపోతున్నారు. కాగా, బర్లీపొగాకు, టమోటో, ఉల్లి, మిర్చి, మామిడి తదితర పంటలకు ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం ఎంతో కొంత స్పందించేదని, 20రోజులుగా ధాన్యం ధరలు తగ్గుతున్నా పాలకులు స్పందించిన సందర్భాలు లేవని రైతులు వాపోతున్నారు. ఎమ్మెల్యేలకు జిల్లాలో పరిశ్రమల కోసం రైతుల నుంచి భూసేకరణలో ఉన్న ఉత్సాహం రైతులకు మద్దతు ధర ఇప్పించడంలో లేదన్నారు.

• కలెక్టర్ స్పందించాలి..

నూతన కలెక్టర్ హిమాన్షు శుక్లా ధాన్యం ధరల పతనంపై స్పందించాలని రైతులు కోరుతున్నారు. ప్రతీరోజు వర్షాలు పడి వడ్లరాశులు తడుస్తుండడంతో రైతులు పడుతున్న ఇబ్బందులపై చర్యలు చేపట్టాలి. డ్రయ్యర్ యంత్రాలు అందుబాటులో ఉంచి, టార్పాలిన్ పట్టలను అందచేయాలి. జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష జరిపి మద్దతు ధర దక్కేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

వర్షాలను సాకుగా చూపి...

జిల్లాలో వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం సుమారు 1.99లక్షల ఎకరా ల్లో ఎడగారు కింద వరి సాగు చేశారు. ప్రస్తుతం కోతలు ప్రా రంభమయ్యాయి. ఈ దశలో ప్రతీరోజు వర్షాలు పడుతున్నాయి. ఇదే అదునుగా దళారీలు రోజుకో రేటు చొప్పున ధాన్యం ధర తగ్గించేస్తున్నారు. ఈనెల మొదటివారంలో రూ.17,500 ఉండగా, అది కాస్తా ఆదివారం నాటికి రూ.15,000లకు పడిపోయింది.



నెల్లూరు రూరల్ మండలం ములుముడి గ్రామం వద్ద ధాన్యం కొలుస్తున్న కార్మికులు



బిరబిరా పెన్నమ్మ

- సంగం బ్యారేజ్‌కి 43వేల క్యూసెక్కుల వరద ప్రవాహం
- 45 గేట్లు ఎత్తి దిగువకు విడుదల

సంగం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజ్‌కి పెన్నా ఎగువ ప్రాంతం నుంచి ఆదివారం 43 వేల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం వస్తుంది. దీంతో బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.2 అడుగుల నుంచి 10.6 అడుగులకు పెరిగింది. శనివారం సోమశిల జలాశయం నుంచి 32వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం రావడంతో 10.2 అడుడుల నీటిమట్టం నమోదైంది. సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి 64 వేలకు పైగా నీటిప్రవాహం వచ్చి చేరుతుండడంతో దిగువకు నీటి విడుదలను పెంచారు. అంతేకాకుండా సంగం బ్యారేజ్‌కి ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి వాగులు, వంకలు ప్రవాహించి సోమశిల జలాలతో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో బ్యారేజ్ వద్ద నీటిమట్టం పెరుగుతుండడంతో బీరాపేరు వరిపొలాలు నీటమునిగే అవకాశం ఉండడంతో 45 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే పెన్నానది దిగువకు సెక్షన్ అధికారులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజ్ నుంచి 45 గేట్ల ద్వారా 43వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.5 అడుగులకు తగ్గింది.



బోధనేతర పనుల నుంచి

విముక్తి కలిగించాలి

- 7న విజయవాడలో ధర్నా : ఏపీటీఎఫ్

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు. నెల్లూరులో ఆదివారం జరిగిన విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగులు ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకుని తమ సమస్యల పరిష్కారం కోసం 15 నెలలుగా ఎదురుచూస్తున్నారన్నారు. 12వ పీఆర్‌సీ నియమించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, సీపీఎస్ రద్దు, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన, పెండింగ్ బకాయిలు చెల్లింపు తదితర సమస్యలు నెరవేర్చలేదన్నారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సిన పీఆర్‌సీ రెండేళ్లు దాటిపోయినా నేటికీ కమిషన్ నియామకం జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించాలని, మెమో 57 ప్రకారం 2003 డిఎస్‌సీ వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. బదిలీ జరిగి రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు 7వ తేదీన విజయవాడ ధర్నాచౌక్ వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలు, గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు రియాజ్, జిల్లా అధ్యక్షుడు ఎం.సురేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పిచ్చిబాబు, రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ. ఒకరి మృతి


వెంకటేశ్వర్లు(ఫైల్)

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం శ్రీరామపురం పంచాయతీ ఉప్పలపాడుకు చెందిన మల్లి వెంకటేశ్వర్లు (44) ఆదివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మల్లి.వెంకటేశ్వర్లు కొన్ని నెలలుగా కుటుంబంతో కలిసి బోగోలు మండలం జువ్వలదిన్నెలో కాపురం ఉంటున్నాడు. రేషన్ సరుకుల కోసం రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి ఆయన తమ్ముడు వెంకటరమణ ఇంట్లో ఉంటున్నాడు. ఉదయం బహిర్భూమికి గ్రామ శివారు ప్రాంతానికి రోడ్డుపై వెళుతుండగా వాహనం ఢీకొనంతో మృతి చెందాడు. ఆయన కుమారుడు మల్లి.గణేష్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై జంపానికుమార్ తెలిపారు. నైట్ హాల్ట్ ఆర్టీసీ బస్సుపై స్థానికంగా అనుమానాలు వస్తుండటంతో ఆ బస్సు డ్రైవరుని విచారిస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

భయపెడుతున్న క్యాన్సర్


క్యాన్సర్ బాధితుడికి శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు (ఫైల్)

- ఏటేటా పెరుగుతున్న మృతులు
- పొగాకు ఉత్పత్తుల వాడకమే వ్యాధికి కారణం
- మృత్యువాత పడ్డ వారిని స్మరించుకునే దినం
- నేడు వరల్డ్ రోజ్ డే (క్యాన్సర్ బాధితుల సాంత్వన దినం)

నేడు క్యాన్సర్ వ్యాధి ఎందరినో మృత్యువుకు చేరువ చేస్తున్నది. ఈ వ్యాధిపై తస్మాత్ జాగ్రత్త అంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయినా ముందస్తు పరీక్షలు చేయించుకోకపోవడంతో జిల్లాలో క్యాన్సర్ రోగులు ఎక్కువగా నమోదవుతున్నారు. ఈ వ్యాధి నివారణ కోసం రూ. లక్షలు ఖర్చు చేస్తున్నా చనిపోయే వారి సంఖ్య జిల్లా వాసులను ఆందోళనకు గురిచేస్తున్నది. కాగా కెనడాకి చెందిన క్యాన్సర్ వ్యాధిగ్రస్తుడు మెలిండా రోజ్ 1996లో సెప్టెంబరు 22న (నేడు) మృత్యువాత పడ్డారు. ఈ సందర్భంగా ఆయన్ను స్మరించుకుంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నేడు ప్రపంచ రోజ్‌డేను నిర్వహిస్తున్నది. వైద్య ఆరోగ్యశాఖ కూడా మరణించిన వారిని స్మరించుకుంటూ ప్రతిఏటా కొవ్వొత్తుల ప్రదర్శన చేపడుతున్నది.

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 13 వేలమందికిపైగా క్యాన్సర్ రోగులు ఉన్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ఎంతోమంది ఈ వ్యాధి బారిన పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించ లేకపోవడంతో బాధితులు మృత్యువకు చేరువవుతున్నారు. సరైన వైద్యం అందక మరెంతోమంది సతమత మవుతున్నారు.జిల్లాలో క్యాన్సర్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. మద్యపానం, ధూమపానం సేవించే వారి సంఖ్య పెరిగింది. వీరిలో చాలాచంది వ్యాధి రెండోదశకు చేరుకున్న వారే. మరెంతోమంది వ్యాధి పరీక్షలు చేయించుకోక పోవటంతో వ్యాధి వెలుగులోకి రాలేదు. వ్యాధిగ్రస్తుల్లో ఎక్కువ శాతం గుట్కా, ఖైనీ, జరదా వంటి మత్తు పదార్థాలను నమిలేవారే. దీని వల్ల నోటికి సంబంధించి దవడ, నాలుక, స్వర పేటిక క్యాన్సర్ వస్తున్నది. ఎంతోమంది వ్యాధిగ్రస్తులు పొగాకు ఉత్పత్తులకు బానిసలుగా మారి క్యాన్సర్ బారిన పడు తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రభు త్వం పొగాకు ఉత్పత్తులు తినరాదని, తద్వా రా క్యాన్సర్ వస్తుందంటూ ప్రచారానికే రూ. కోట్లు ఖర్చుచేస్తున్నా, సరైన నియంత్రణ విధానాలు లేకపోవడంతో క్యాన్సర్ బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఇక స్త్రీ సంబంధిత క్యాన్సర్ రోగులు కూడా ఎక్కువగా నమోదు కావడం ఆందోళన కలిగించే విషయమే. బ్రెస్ట్ క్యాన్సర్ బాధితుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. వైరల్ ఇన్‌ఫెక్షన్ ద్వా రా సురక్షితం కానీ లైంగిక సంబంధాల వల్ల మహిళల్లో గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారు.

వ్యాధితో మరణించిన వారిని స్మరించుకుంటూ...



క్యాన్సర్ వ్యాధితో మరణించిన వారిని స్మరించుకుంటూ ఏటా సెప్టెంబరు 22న ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాం. కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్నాం. జిల్లాలో క్యాన్సర్ రోగులను గుర్తించి వారికి వైద్య చికిత్సలు అందేలా కృషి చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేస్తున్నాం.

\- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

చికిత్సలు ఇలా..

ప్రభుత్వ పరంగా జిల్లాలోని జీజీహెచ్‌లో క్యాన్సర్ వ్యాధికి కొంతవరకు చికిత్సలు అందుతున్నాయి. దీంతో పాటు ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ విభాగం కూడా చికిత్సలు అందిస్తున్నది. అలాగే మెడికవర్ ఆసుపత్రిలో కూడా ప్రత్యేక విభాగం ఉంది. మరికొంత మంది హైదరాబాద్‌లో ఉన్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద ఎంతోమంది వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు. ప్రతి ఏటా ఐదువేల మందికి పైగా క్యాన్సర్ బాధితులకు రెడ్‌క్రాస్ వైద్యసేవలు అందిస్తున్నది. తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రి కూడా కొంత వరకు క్యాన్సర్ రోగులకు సేవలు అందిస్తున్నది.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

- చర్యలు తీసుకుంటాం : ఏఈ


మట్టి తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్

కలిగిరి, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలో యదేచ్ఛగా చెరువుల నుండి మట్టి అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఆదివారం మండలంలోని నాగిరెడ్డిపాలెం చెరువునుండి జేసీబీ యంత్రంతో పది ట్రాక్టర్లకు పైగా మట్టి తరలిస్తుండగా స్థానికులు ఫిర్యాదుచేయడంతో అధికారులు తవ్వకాలను అడ్డుకున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై ఇరిగేషన్ ఏఈ శ్రీనాథ్‌ను వివరణ కోరగా... అక్రమ తవ్వకాలుచేసిన జేసీబీ, ట్రాక్టర్లను గుర్తించామని వారిపై కేసులు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఐదు బియ్యం లారీల స్వాధీనం

- రేషన్ బియ్యం ఉన్నట్లు అనుమానం
- నేడు నిర్ధారించనున్న పౌరసరఫరాల శాఖ

నెల్లూరురూరల్,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఒకటి కాదు, రెండు కాదు... ఏకంగా ఐదు బియ్యం లారీలను పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల మధ్య సుభాన్‌నగర్ వద్ద ఓ వ్యక్తి ఐదు లారీల్లో బియ్యం లోడ్ చేయాలన్ని గుర్తించిన స్థానికులు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన రూరల్ ఏఎస్‌వో అంకయ్య, సీఎస్‌డీటీ జమీర్‌బాషాను రంగంలోకి దింపారు. ఘటన స్థలానికి వారిని పంపి లారీలను తనిఖీ చేయాలని ఆదేశించారు. దీంతో వారు మొదట లారీలను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం బియ్యాన్ని పరిశీలించారు. అవి రేషన్ బియ్యం అవునా.. కాదా..? అన్న అనుమానంతో నమూనాలను సేకరించారు. వాటిని పరీక్షించేందుకు ఆదివారం సెలవు కావడంతో లారీలను నెల్లూరురూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సోమవారం పౌరసరఫరాల శాఖ నేతృత్వంలో బియ్యాన్ని పరిశీలించి, తదుపరి చర్యలు తీసుకుంటామని సీఎస్‌డీటీ జమీర్‌బాషా తెలిపారు. అవి రేషన్ బియ్యం అని తేలితే పీడీఎస్ భారీ రాకెట్ పట్టుబడినట్లు తేలుతుంది. దీని వెనుక సూత్రధారులు, పాత్రధారులపైనా విచారణ కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుత ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సీరియస్‌గా ఉండటంతో ఈ అంశం తాజాగా చర్చనీయాంశంగా మారింది. కాగా బియ్యం లారీలను సీసీకెమెరా నిఘాలో ఉంచినట్లు రూరల్ సీఐ వేణు తెలిపారు.


సివిల్ సప్లయ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం లారీలు


బియ్యాన్ని పరీక్షలకు సేకరిస్తున్న ఉద్యోగి

నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత

- వీరి చలపతిరావు అరెస్టుతో వచ్చిన వైసీపీ శ్రేణులు



స్టేషన్ నుంచి వెలుపలకు వస్తున్న వైసీపీ నాయకులు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత వీరి చలపతిరావును అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని నెల్లూరురూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సమాచారం అందుకున్న ఆ పార్టీ శ్రేణులు ఆదివారం పెద్ద సంఖ్యలో అక్కడకి చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పీ.చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్‌లు పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని వీరి చలపతిరావు అరెస్టుపై పోలీసులను ప్రశ్నించారు. అనంతరం బయటకు వచ్చిన వారు మీడియాతో మాట్లాడారు. ఎప్పుడో పాత కేసులను తోడి తమ పార్టీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని దుయ్యబట్టారు. ఉద్దేశపూర్వకంగానే చలపతిరావుపై కఠినమైన సెక్షన్లతో కేసు నమోదు చేసి బెయిల్ రానివ్వకుండా చూస్తున్నారని చెప్పారు. రాష్ట్రమంతటా ఒక తీరైతే నెల్లూరులో మరోకతీరు నడుస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలను ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బియ్యం వ్యాపారి అరెస్ట్

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లుల నుంచి బియ్యం తీసుకెళ్లి తిరిగి నగదు చెల్లించకపోవడంతో నమోదైన కేసులో ఓ బియ్యం వ్యాపారిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ ఆదివారం తెలిపారు. నెల్లూరు రూరల్లోని వడ్లమూడి వెంకటేశ్వర్లునాయుడు నుంచి బియ్యం కొనుగోలు చేసిన ఆ వ్యాపారి అందుకు సంబంధించిన నగదు చెల్లించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడు విజయవాడకు చెందిన కోట వెంకట సత్యనారాయణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

అప్పుగా తీసుకున్న నగదు అడిగినందుకు దాడి


చికిత్స పొందుతున్న శ్రీనివాసులు

కావలి రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అప్పుగా తీసుకున్న నగదు అడిగినందుకు ఓ వ్యక్తిపై దాడిచేసిన సంఘటన ఆదివారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని పుచ్చలపల్లివారి వీధికి చెందిన శ్రీనివాసులు వద్ద రెండు సంవత్సరాల క్రితం పూర్ణయ్య అనే వ్యక్తి లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నాడని, నగదు ఎప్పుడు అడిగినా సరైన సమాధానం చెప్పేవాడు కాదని బాధితుడు వాపోయాడు. ఈక్రమంలో రుద్రకోటలోని సాయిరాం డాబా పక్కన జరిగిన ఒక కార్యక్రమంలో శ్రీనివాసులు పూర్ణయ్యను నగదు విషయం అడిగాడు. దీంతో నేను ఇవ్వను ఏమిచేసుకుంటావో చేసుకోఅంటూ దుర్భాషలాడుతూ పూర్ణయ్యతో పాటు ఆయన అనుచరుడు శ్రీరాములు కలిసి శ్రీనివాసులుపై దాడిచేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును ఆటోలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు


అంకమ్మ(ఫైల్)

ఆత్మకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వివాహిత అదృశ్యంపై కేసు నమోదయింది. పోలీసుల వివరాల మేరకు... కలిగిరి మండలం చీమలవారిపాళెం గ్రామానికి చెందిన అంకమ్మ అనే మహిళ కడపలో ఉన్న తన భర్త వద్దకు వెళ్లేందుకు 6వ తేదీన నెల్లూరుపాళెంలో కడప వెళ్లే బస్సు ఎక్కింది. సాయంత్రమైనా సదరు మహిళ భర్త వద్దకు వెళ్లలేదని ఆమె తల్లి ధనమ్మ సోమవారం ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు ఈ కింద 9440796390, 9440796371 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

'పాడి'కి ప్రోత్సాహం

- వందశాతం రాయితీపై బహువార్షిక పశుగ్రాస పథకం
- 10 - 50 సెంట్ల సాగుకు అవకాశం
- 75శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు
- 50శాతం రాయితీపై సమీకృత దాణా

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపైనే జిల్లాలో ఎంతో మంది రైతులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇటు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ రంగానికి సైతం ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగానే పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు వంద శాతం రాయితీతో బహువార్షిక పశుగ్రాసాల సాగు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నది. దీనికిగానూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నుంచి నిధులు కేటాయించింది. ఇప్పటికే 50శాతం సబ్సిడీతో సమీకృత దాణా, 75శాతం రాయితీపై గడ్డి విత్తనాలు అందిస్తున్నది.





ఒక ఏడాదికి నిధుల చెల్లింపులు ఇలా..

విస్తీర్ణం సెంట్లలో	వేతనాలు (రూ.)	సామగ్రి ఖర్చు (రూ.)	మొత్తం (రూ.)
10	3,000	3,599	6,599
20	6,000	7,197	13,197
30	9,000	10,795	19,795
40	12,000	14,394	26,394
50	15,000	17,992	32,992

కొద్ది స్థలంలో పెంపకం

పశుగ్రాసం కొరత వల్ల పాల ఉత్పత్తి తగ్గి రైతులు నష్టపోతున్నారు. దీన్ని అధిగమించేందుకు బహువార్షిక పశుగ్రాస పథకాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఐదు ఎకరాల భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలతోపాటు చిన్న, సన్నకారు రైతులు బహు వార్షిక పశుగ్రాసాల సాగు పథకానికి అర్హులు. వ్యక్తిగతంగా 10 నుంచి 50సెంట్ల వరకు సాగు చేసుకునే అవకాశం ఉంది. ఉపాధి హామీ జాబ్ కార్డు, పొలం, నీటి వసతి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్, రేషన్‌కార్డు, పొలం 1బీ, బ్యాంకు పాసుబుక్ జెరాక్సులు అవసరం. ఆసక్తి కలిగిన రైతులు స్థానిక ఎంపీడీవోకి దరఖాస్తు చేసుకోవాలి. ఎంపీడీవో పరిశీలించి ఉపాధిహామీ ఏపీవోకు పంపిస్తారు. ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాలు సిద్ధం చేస్తారు. ఆతరువాత నిధులు మంజూరు చేస్తారు. మరింత సమాచారం కోసం దగ్గరలోని రైతు సేవా కేంద్రాలు, పశువైద్యాధికారులను సంప్రదించాలి. 2025-26 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 112 మంది రైతులు 54 ఎకరాల్లో సాగు చేసేందుకు ముందుకువచ్చారు.

వందశాతం రాయితీ



పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం వందశాతం రాయితీపై బహువార్షిక పశుగ్రాసం సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నది. స్వయం సమృద్ధి సాధన కోసం ఉపాధిహామీ పథకానికి అనుసంధానం చేసింది. ఇప్పటికే 50శాతం రాయితీపై సమీకృత దాణాను ఇస్తున్నాం. జొన్న, మొక్కజొన్న, సజ్జలు అలసంద వంటి స్వల్పకాలిక పశుగ్రాస విత్తనాలు 75శాతం రాయితీపై అందిస్తున్నాం. దాదాపు 94టన్నులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

\- డాక్టర్ రమేష్‌నాయక్, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	272

కోడిగుడ్ల ధర (100): 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.10588
వెండి కిలో ధర	రూ. 135100
వెండి ఒక గ్రాము	రూ.138.10

రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు మాట్లాడుతూ జనతా ఫౌండేషన్‌లో ఎక్కువగా ఉన్న యువకులు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ దాసరి ప్రసాద్ గౌడ్, డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి నరేంద్ర, నరసింహ, కోటేశ్వరరావు, రాజా, మనోజ్, మురళి, తదితరులు పాల్గొన్నారు.


మూతలేని మ్యాన్‌హోల్


మ్యాన్‌హోల్‌కు తాత్కాలికంగా అడ్డుపెట్టిన షీట్


ఇంటి ముందు మూత తెరిచి ఉన్న...


దుకాణం ముందు ప్రమాదకరంగా...

నోళ్లు తెరిచిన మ్యాన్‌హోళ్లు!

- మురుగు తీశారు.. మూతలు మరిచారు
- శెట్టిగుంటరోడ్డు నుంచి వీవర్స్‌కాలనీ వరకు ఇదే పరిస్థితి
- పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళనలో ఆయా ప్రాంతాల ప్రజలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆ ప్రాంతంలో పదుల సంఖ్యల్లో దుకాణాలు, నివాసాలు ఉన్నాయి. వేలాది మంది ప్రజలు అక్కడే తిరుగుతుంటారు. అలాంటి ప్రాంతంలో ఇళ్లకు, దుకాణాలకు ముందు మ్యాన్‌హోల్స్ నోరులు తెరుచుకొని ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. నగరంలోని శెట్టిగుంట రోడ్డు నుంచి వీవర్స్‌కాలనీ సెంటర్ ముందు వరకు రోడ్డుకు పక్కనే ఇళ్లు, దుకాణాలను అనుకొని ఉన్న కాలువలో మురుగు తీసేందుకు మ్యాన్‌హోల్స్ మూతలను ఓపెన్ చేశారు. మురుగు తీశారు కానీ మూతలు వేయలేదు. నెలలు గడుస్తున్నా మూతలు ఏర్పాటు చేయకపోవడంతో ఆ ప్రాంత ప్రజలే మ్యాన్‌హోల్స్‌పై తాత్కాలికంగా చెక్కలు, రాళ్లు అడ్డుపెట్టుకున్నారు. చిన్నారులు ఆ ప్రాంతంలోనే ఆడుకుంటుంటారు. వారు రోడ్డే కదా అని అడుగులు వేస్తే నేరుగా మురుగు కాలువలోకి వెళ్లే ప్రమాదం ఉంది. మూగజీవాలు మూతల్లేని మ్యాన్‌హోల్స్‌లో పడి నరకం అనుభవిస్తున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మ్యాన్‌హోల్స్‌పై మూతలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

మహిళల అభ్యున్నతికి 'కుట్టు' దోహదం

- మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అనూరాధ


మహిళలతో కలసి విక్టరీ సింబల్ చూపుతున్న అనురాధ

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు శిక్షణ కేంద్రాలు దోహదపడుతాయని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, టీడీపీ నేత తాళ్లపాక అనూరాధ పేర్కొన్నారు. నగరంలోని తడికల బజారులో ఉన్న కమ్యూనిటీ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ కేంద్రంలో ఎలాంటి శిక్షణ ఇస్తున్నారో మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రారంభించిన కుట్టు మిషన్ కేంద్రాల ద్వారా ఎందరో మహిళలు శిక్షణ పొందుతుండడం శుభపరిణామమన్నారు. దీనిని ఆసరా చేసుకుని మహిళలు అనుకున్న లక్ష్యాలను సాధించాలని కోరారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈ ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ను ప్రోత్సహిస్తున్నరాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులు విజన్ ఉన్న నేతలని కొనియాడారు. వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఏ రంగంలోనైనా విజయం సాధిస్తామని మహిళలతో కలసి విక్టరి సంకేతాన్ని చూపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బాబు, హేమంత్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్‌లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పెన్షన్ల పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ సేవలు ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రంగనాయకులపేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ కల్యాణ మండపంలో వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు మహేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ వారు వ్యాపారంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గత 18 ఏళ్లుగా 70 మంది వృద్ధులకు ప్రతినెల రూ.500 పెన్షన్ పంపిణీ చేయడం సంతోషదాయకమన్నారు. వృద్ధులకు ఐయితా సుబ్బారాయుడు, ఆయన సోదరి తాతా సుజాత ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యవర్గ సభ్యుడు కూరపాటి వేణుమాధవ్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బులియన్ మర్చంట్స్ అధ్యక్షుడు కొనగళ్ శోభన్‌బాబు, కోశాధికారి భోగనాథం సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీ చందోలు సతీష్‌కుమార్, ఏల్చూరు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, పువ్వాడ రాధాకృష్ణ, కొలపర్తి అనిల్, మధు పాల్గొన్నారు.


పెన్షను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

నవరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం


రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. అన్ని అమ్మవారి ఆలయాలలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు, క్యూలైన్లు, ఏర్పాటుతోపాటు భక్తులకు అనేక సౌకర్యాలు కల్పిస్తూ సర్వం సిద్ధం చేశారు.

- రాజరాజేశ్వరి ఆలయంలో సోమవారం ఉదయం 6గంటలకు కలిశస్థాపన, సంపుటీకరణ, ఛండీహోమం, అమ్మవారికి ఛండీ అలంకారం, పూలంగిసేవ, లలితాకుంకుమార్చన, మహాన్యాసాలు జరుగుతాయి.
- స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం ఉదయం మహిళలు పెన్నా జలాల కలిశాల శోభాయాత్రగా ఆలయానికి చేరుకుంటారు. అమ్మవారికి కాత్యాయినీ అలంకారం, మూలవర్లుకు పూలంగిసేవ జరుగుతుంది.
- ఇరుకళల పరమేశ్వరీ ఆలయంలో ఉదయం అభిషేకం, కలిశస్థాపన, సాయంత్రం పూలంగిసేవ, రాత్రి పల్లకీసేవలు నిర్వహిస్తారు. అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు.
- మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరీదేవికి నిత్యపూజలు, ఆర్జితసేవలు, జరుగుతాయి. సాయంత్రం 5.30గంటలకు కలిశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.
- మూలాపేట శ్రీకృష్ణధర్మరాజుస్వామి ఆలయంలో సాయంత్రం 6.30గంటలకు కలిశ స్థాపనతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి.
- బాలాజీనగర్ సీతారామ మందిరంలో ప్రతీరోజు ఉదయం పంచామృతాభిషేకాలు, లక్ష్మీహోమం, సీతామహాలక్ష్మీ హోమం, లక్ష్మీ ఆరాధనా హోమం, సాయంత్రం అష్టలక్ష్మీ వైభవం, దేవీ ఖడ్గమాల, వేద సూక్త సాముహిక సుహాసినీలచే కుంకుమార్చనలు నిర్వహిస్తారు. ఉదయం 7గంటలకు కలిశ స్థాపనతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి.
- కోదండరామపురం మహాలక్ష్మీ ఆలయంలో విశేష నవావరణ, అష్టోత్తర సహస్ర నామపూజలు జరుగుతాయి. ఉదయం కలిశ స్థాపన, రాత్రి గాయత్రీదేవి అలంకారం జరుగుతుంది.
- నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట బాపు గిరిజన కాలనీలోని మహాలక్ష్మీ ఆలయంలో ప్రతీరోజు అభిషేకం, నవా వరణం, ఛండీహోమం, సహస్ర నామం, లక్ష్మీ కుంకుమార్చన, పూజలు జరుగుతాయి. 22వ తేదీ ఉదయం ధ్వజారోహణం, కలిశ స్థాపన, 23న గాయత్రీదేవి, 24న ధనలక్ష్మీదేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న గజలక్ష్మీదేవి, 27న వైష్ణవీదేవి, 28న సంతానలక్ష్మీదేవి, 29న సరస్వతీదేవి, 30 న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసుర మర్దిని, 2న విజయలక్ష్మీ అలంకారం, నగరో త్సవాలు జరుగుతాయ ని తెలిపారు. 2వతేదీ మధ్యాహ్నం 12గంటలకు మంత్రి పొం గూరు నారాయణ, రమాదేవిల ఆధ్వర్యంలో అన్నప్రసాదం వితరణ జరుగుతుంది.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో..


ఆహ్వానపత్రికలు ఆవిష్కరిస్తున్న కమిటీ నాయకులు


బాపు గిరిజన కాలనీలోని మహాలక్ష్మి

నగరంలోని విరాట్‌నగర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం నుంచి అక్టోబరు 1 వరకు గాయత్రీదేవి, గోవిందమాంబలకు దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం శాశ్వత అధ్యక్షుడు కందుకూరి చెంగయ్య ఆచారి తెలిపారు. ఆదివారం ఆలయంలో నవరాత్రి వేడుకల ఆహ్వానపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీరోజూ నిత్య పూజలతోపాటు సోమవారం రాత్రి శ్రీవిజయదుర్గా దేవి, 23న శ్రీబాలత్రిపుర సుందరీదేవి, 24న వేదమాత మహాగాయత్రిదేవి, 25న రాజ రాజేశ్వరిదేవి, 26న లలితాపరమేశ్వరిదేవి, 27న మహాలక్ష్మీ దేవి, 28న పార్వతీదేవి, 29న సరస్వతీదేవి, 30న మహిషాసురమర్ధిని, అక్టోబరు 1న అన్నపూర్ణాదేవి అలంకారాల్లో నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులందరూ తరలిరావాలని కోరారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను రక్షించాలి


మొక్కలు నాటుతున్న కర్తం ప్రతాప్‌రెడ్డి

నెల్లూరు (సిటీ), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం నాటే ప్రతి మొక్కను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి సూచించారు. నగరంలోని 14వ డివిజన్ లోని పలు ప్రాంతాలలో వారాధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కర్తం ప్రతాప్ రెడ్డి మాట్లాడారు. లక్ష మొక్కలు నాటాలన్న సంకల్పంతో ఫౌండేషన్ పని చేయడం అభినందనీయమన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటికి రక్షణ గార్డులను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నాటిన ప్రతీ మొక్కల బ్రతకాలని, అందుకు స్థానికంగా ఉండే వ్యక్తులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు రంగనాథం, కిషోర్, రామాంజనేయరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంతర్షవలి దర్గాలో గంధమహోత్సవం


గంధం కలుపుతున్న మత పెద్దలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోటమిట్ట హల్తాలి మసీదు సమీపంలోని కాంతర్షవలి దర్గాలో శనివారం అర్ధరాత్రి గంధమహోత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి వ్యాపారవేత్త షేక్.ఇంతియాజ్ సమర్పించిన గంధపు చెక్కలతో గంధం తయారు చేసి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ మెంబర్లు రసూల్, మజూర్ ముస్తాక్, జాకీర్, రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చాముండేశ్వరి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంగపట్నం శ్రీచాముండేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వైభవంగా జరుగుతాయని దేవ స్థానం కార్య నిర్వాహణాధికారి తాతా శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ సంవత్సరం నూతనంగా 'త్రిశక్త్యాత్మక శ్రీచాముండేశ్వరి మూల మంత్ర గాయత్రి మంత్ర హోమం' నిర్వహిస్తున్నామన్నారు. పాల్గొనదలచిన భక్తులు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. శ్రీచాముండేశ్వరి మాల వేసే భక్తులు సోమవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం వద్దకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆయన తెలిపారు.

వీడని చీకటి.. వదలని 'మురుగు' కంపు!

- గంధం ఉత్సవాల నిర్వహణ అధ్వానం
- అడుగడుగునా 'వక్ఫ్‌బోర్డు' నిర్లక్ష్యం
- రూ. 16 లక్షల్లో సగమైనా ఖర్చు చేశారా?
- కసుమూరులో తగ్గని భక్తుల రద్దీ..
- దర్గాలో మహాలయ అమావాస్య పూజలు


మురుగునీటిలో భక్తుల అవస్థలు


మహాలయ అమావాస్య సందర్భంగా దర్గాలో భక్తుల రద్దీ

వెంకటాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి దర్గాలో భక్తుల రద్దీ ఇంకా తగ్గలేదు. ఆదివారం మహాలయ అమావాస్య కావడంతో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు రాష్ట్ర నలమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మస్తాన్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తలనీలాలు సమర్పించడంతో పాటు అన్నదానం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వక్ఫ్‌బోర్డు అధికారుల తీరుపై విమర్శలు

ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగిన మస్తాన్ వలి 248వ గంధమహోత్సవానికి సంబంధించి వక్ఫ్‌బోర్డు శాఖ రూ. 16 లక్షలు మంజూరు చేసింది. అయితే ఉత్సవాల నిర్వహణలో వక్ఫ్‌బోర్డు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు కనీస వసతులు కూడా కల్పించలేదని మండిపడుతున్నారు. కనీసం చందన్‌మహల్ వద్ద లైటింగ్ కూడా సక్రమంగా లేదని, వర్షం కారణంగా నేలంతా చిత్తడిగా మారడంతో భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. తాగునీటి చలివేంద్రాలు, బయో టాయిలెట్లు ఏర్పాటు చేయలేదన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. 19వ తేదీ ఉదయం దర్గాలోకి గంధమహోత్సవ సమయంలో మస్తాన్ వలి సమాధికి కనీసం పుష్పాలంకరణను కూడా వక్ఫ్‌బోర్డు అధికారులు విస్మరించారని, పాసులు ఇష్టానుసరంగా అనుమతించారని భక్తులు ఆరోపిస్తున్నారు. 19వ తేదీ రాత్రి కురిసిన భారీ వర్షం వల్ల దర్గా ఎదుట, ప్రధానమార్గంలో వర్షపు నీరు డ్రైనేజీ నీటితో కలిసి దుర్గంధం వెదజల్లడంతో భక్తులు నరకయాతన అనుభవించారు. గంధ మహోత్సవం జరిగిన మూడు రోజులూ దర్గా ప్రాంగణం, పరిసరాలు, చెరువు కట్ట తదితర ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవించింది. వక్ఫ్‌బోర్డు అధికారులు కనీస పారిశుద్య చర్యలు చేపట్టలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ. 16 లక్షల నిధులేమయ్యాయి?

వక్ఫ్‌బోర్డు శాఖ మంజూరు చేసిన రూ. 16 లక్షల్లో కనీసం 50 శాతం నిధులు కూడా గంధం ఉత్సవాలకు ఖర్చు పెట్టలేదని, మిగిలిన నిధులు ఏమయ్యాయని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది గంధమహోత్సవం ఏర్పాట్లు, నిర్వహణలో నూటికి నూరు శాతం వక్ఫ్‌బోర్డు అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. తాము ఎన్నో గంధమహోత్సవాలు చూశామని, ఈ ఏడాది ఉన్నంత అధ్వాన పరిస్థితి ఎన్నడూ చూడలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ నిర్లక్ష్యానికి బాధ్యులైన వక్ఫ్‌బోర్డు అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్ర మంలో ముందుగా కొత్తూరు హైస్కూల్ టీచర్ పీవీ శేషయ్య మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల పట్టువస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యార్థులు, గ్రామ స్తులు పాల్గొన్నారు.

నేను.. నా జన సైనికుడు.. మన గాజు గ్లాసు!


గాజు గ్లాసులతో జనసైనికుల ప్రదర్శన

ముత్తుకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణీభవానీ నాయుడుతో కలిసి ఆదివారం బండ్లపాలెంలో 'నేను, నా జనసైనికుడు, మన గాజు గ్లాసు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో పవన్‌కళ్యాణ్ అభిమాని, జనసైనికుడి ఇంట్లో ఒక గాజు గ్లాసు ఉండేలా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సందూరి శ్రీహరి, బోలా అశోక్, సురేష్ ప్రసాద్, రఘురాం, శోభన్, అజయ్ పాల్గొన్నారు.

సహ యోగ ఉపాధ్యాయ శిక్షణ శిబిరం


శిక్షణ ఇస్తున్న పతంజలి యోగ సమితి నిర్వాహకులు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైపాడు సముద్ర తీరాన వెలసిన శివాలయ ప్రాంగణంలో ఆదివారం పతంజలి సహయోగ ఉపాధ్యాయ శిక్షణ శిబిరం నిర్వహించారు. పతంజలి యోగ పీట్ పూజ్య శ్రీరాందేవ్ బాబా ఆశీర్వాదంతో పతంజలి యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు యోగాచార్య గ్రంథవల్ల బాలసుబ్రహ్మణ్యం గురూజీ అధ్యక్షతన శిక్షకుల ప్రత్యక్ష యోగాసనాల పరీక్ష యజ్ఞం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ యోగా టీచర్ యోగాసనాలపై మాస్టర్లకు శిక్షణ ఇచ్చారు. భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు బి విజయ్ కుమార్ రెడ్డి ప్రకృతి వైద్యం, యోగా థెరపీ, హీలింగ్ ప్రక్రియలపై అవగాహన కల్పించారు. నెల్లూరు భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ పెంచలయ్య, పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ఉపాధ్యక్షుడు ముత్యా ల రవీంద్ర, పతంజలి యువ భారత్ ఇన్‌చార్జ్ కోటేశ్వర్ రెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం పతంజలి ఏవైటీటీ ఇన్‌చార్జ్ జ్యోతిరాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే వర్షపు నీరు


రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

రాపూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి పట్టణంలోని తూర్పు అగ్రహకట్ట రోడ్డులో వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు అక్కడి స్థానికులు ఇళ్లలో నుంచి మురుగునీరు కూడా అందులోకి వదులుతుండడంతో దుర్గంధం నీటిలోనే పాదచారులు నడవలసివస్తోంది. వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు వెంటనే చొరవ తీసుకుని వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా చర్యలు తీసుకోవాలని, మురుగు కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

జయహో.. దుర్గాభవానీ! చూడరో.. దసరా శోభని!


విద్యుద్దీపాలంకరణతో వెలుగులీనుతున్న అమ్మవారి ఆలయం

పొదలకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్న వేళ పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు, చాముండేశ్వరి అమ్మవారి, అయ్యగారిపాలెంలోని పార్వతీదేవి అమ్మవారు, శివాలయంలోని కామాక్షితాయి అమ్మవారి భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణం నాలుగు మూలల స్వాగత తోరణాలతో ప్రధాన వీధులను శోభాయమానంగా తీర్చిదిద్దారు. అమ్మ సన్నిధి ముంగిట.. ఆలయమంతా విద్యుద్దీపాలతో అలంకరించగా దీదేప్యమై విరాజిల్లుతోంది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఏటా అశ్వయుజ మాసంలో జరిగే శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలు ఈనెల 22 (నేటి) నుంచి వచ్చే నెల అక్టోబరు 5వరకు జరుగనున్నాయని ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు రాచపూటి రామలింగయ్య, అధ్యక్షులు వాకాటి రాఘవేంద్రరావు(ప్రసాద్) తెలిపారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీ అమ్మవారు ఒక్కోరోజు ఒక్కొక్క అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 22వతేదీ కన్యకాపరమేశ్వరిదేవి అలంకారం, 23న రాజరాజేశ్వరిదేవి అలంకారం, 24న అన్నపూర్ణదేవి, 25న బాలత్రిపుర సుందరీదేవి, 26న ధనలక్ష్మీదేవి, 27న గాయత్రిదేవి, 28న గజలక్ష్మీదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసురమర్ధిని, 2న విజయలక్ష్మీదేవి అలంకారం, అనంతరం గ్రామోత్సవం, 3న దర్బారు అలంకారం, 4న శయ్యాలంకారం, ఊంజలసేవ, 5న పసుపుకుంకుమలతో అభిషేకాలు, శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా రూరల్ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు అమర్తలూరు చెంచయ్య, ఆకులూరి విజయకుమార్, ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ బ్రహ్మయ్య, పొట్టి సుధాకర్, కార్యదర్శి తన్నీరు సురేష్‌కుమార్, రాజా సురేంద్ర బాబు, గుర్రం మీరా మధు, తన్నీరు వీరప్రకాశం, రాచపూటి ధనుంజయరావు, శీతాళం వెంకటరమణయ్య (రామారావు) సభ్యులు తన్నీరు సురేష్‌బాబు, దామిశెట్టి రవీంద్రబాబు, ఫైడా కామేశ్వరరావు, క్రిష్ణం వెంకటరమణయ్య, నున్నా విజయలక్ష్మీ, దుగ్గిశెట్టి సుశీల, రాచపూటి శ్రీవాసంతి లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో చేనేత వస్త్రాల విక్రయ కేంద్రాలు


మందులు అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి

ముత్తుకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలన్న స్ఫూర్తితో ప్రతీ మండల కేంద్రంలో చేనేత వస్త్రాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి తెలిపారు. ఆదివారం కృష్ణపట్నంలో జయభారత్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు వేళ్లపాలెం సంపత్ రెడ్డి, కాకుటూరు రవీందర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, మండల కార్యదర్శి శివ, ప్రసాద్, అశోక్, గిరి, ప్రసాద్‌శర్మ, భార్గవ్, విజయ్, శ్రవణ్, వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాటు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌త మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సీతయ్యోరి' వీధి బడి..చూస్తే గుండె తడి !

● ఎందరో ప్రముఖులు అక్షరాలు దిద్దుకున్న బ(గు)డి ● శిథిలావస్థలో 'చదువుల' ఆలయం



కోవూరులోని 'సీతయ్యోరు' వీధిబడి

కోవూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానికి పూర్వమెప్పుడో సీతయ్య స్థాపించిన వీధిబడి ఎందరో విద్యార్థుల్ని మేధావులుగా తీర్చిదిద్దింది. ప్రముఖులుగా వారు ఎదగడానికి మేథో విజ్ఞాన భాండాగారమై నిలిచింది. 'సీతయ్యోరి' బడిగా అందరూ ఎంతో ఆత్మీయంగా పిలుచుకొనే ఈ వీధి బడి.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలగా మారింది. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రముఖులుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని సొంతం చేసుకున్నారు. ఇరువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా, హైకోర్టు న్యాయమూర్తులుగా సేవలందించారు. ప్రముఖ హృద్రోగ నిపుణులుగా, క్యాన్సర్ వ్యాధి నివారణ వైద్యులుగా అంతర్జాతీయస్థాయిలో గుర్తింపును, గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. ఇక్కడ అక్షరాలు దిద్దిన పలువురు చలనచిత్ర రంగంలో కూడా అప్పట్లోనే సంచలనాలు సృష్టించారు. ఎంతోమంది విద్యార్థుల్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళిన నాటి 'సీతయ్యోరు' వీధిబడి నేడు దయనీయ స్థితికి చేరుకుంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 'ఏకోపాధ్యాయిని' పాఠశాలగా మారింది. ఒకే ఒక ఉపాధ్యాయురాలు ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్నారు. పాఠశాల తరగతి గదిలో చిత్రించిన దేశభక్తుల ఫొటోలు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే ఈ పాఠశాలను అభివృద్ధి చేయాలని పలువురు విద్యావేత్తలు, తల్లిదండ్రులు కోరుతున్నారు. బ్రిటీష ప్రభుత్వ హయాంలోనే విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిన ఈ చదువుల దేవాలయం ఓ చారిత్రక అవశేషంగా కాలగర్భంలో కలిసిపోకుండా రక్షించుకోవలసిన చారిత్రక అవసరం ప్రభుత్వం, విద్యాశాఖాధికారులపైన ఎంతో ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ దిశగా స్పందించాలని, చేయూత అందించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



చిన్నారికి బోధిస్తున్న ఉపాధ్యాయిని

ఆరేళ్లుగా ఎదురుచూపులు

● విడుదల కాని పెళ్లికానుక నిధులు ● వైసీపీ హయాంలోనే మంగళం

● ఇంకా దృష్టి సారించని ప్రభుత్వం ● అసలు పథకం ఉన్నట్లా.. లేదా..?

● సంగం గ్రామానికి చెందిన జే. చవడయ్య నిరుపేద కుటుంబం. 2020 ఏప్రిల్‌లో ఆయన తన కుమార్తెకు వివాహం చేశారు. సుమారు రూ. మూడు నుంచి రూ. నాలుగు లక్షల వరకు ఖర్చయింది. సుమారు రూ. రెండు లక్షలు అప్పు చేసి పెళ్లి చేశాడు. పెళ్లికానుకకు దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకు ఖాతాకు నేరుగా నగదు జమ అవుతుందని అధికారులు చెప్పారు. అదిగో...ఇదిగో... అంటూ కాలయాపన చేశారు. నాలుగేళ్ల ఎదురుచూశాం. మంజూరు కాలేదు. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. వైసీపీ ఓడిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పెళ్లికానుకపై ఆశలు పెట్టుకున్నాం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పెళ్లి కానుక లేదు. ఎదురు చూస్తున్నామని బాధితుడు వాపోయాడు.

● వంగల్లు గ్రామానికి చెందిన వెంకటరమణయ్యది నిరుపేద దళిత కుటుంబం. ముగ్గురు ఆడపిల్లలు. 2024 ఆగస్టులో పెద్ద కుమార్తెకు విడవలూరు మండలంలో ఓ యువకుడికి ఇచ్చి వివాహం చేశాడు. కూటమి ప్రభుత్వంలో పెళ్లి కానుక వస్తుందని ఆశతో కొంత అప్పు చేసి పెళ్లి చేశాడు. ఏడాది దాటింది. అయినా ఇంత వరకు ఆ ఊసే లేదు. వడ్డీ పెరిగిపోతుంది. పెళ్లికానుక వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నాం. ఈ పరిస్థితి ఏ ఒక్క చవడయ్య, వెంకటరమణయ్యలదే కాదు. జిల్లాలో వందల మంది ఆడబిడ్డ తల్లిదండ్రులది.

సంగం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఒకరు కాదు ఇద్దరు కాదు వందల మంది పెళ్లికానుక కోసం వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్నారు. ఏ ఒక్కరికీ కానుక అందలేదు. గత ప్రభుత్వంలోనే దాదాపు మూడు వేలకు పైగా అర్హులు దరఖాస్తు చేసుకున్నారు. అదిగో... ఇదిగో.. అంటూ కాలయాపన చేశారు. కానీ ఒక్కరికీ మంజూరు కాలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పథకంపై కదలిక వచ్చింది. కానీ చెల్లింపులు మాత్రం జరగడంలేదు. దీంతో కానుక కోసం పేదింటి తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూపులు పేదిళ్లలో పిల్లల



వివాహం తల్లిదండ్రులకు ఆర్థిక భారం. చేతిలో రూ. లక్షలాది రూపాయలు ఉండాల్సిందే. స్థోమత ఉన్నవారికి పర్వాలేకున్నా, సామాన్య, మధ్య తరగతి వారికి రుణం తప్పదు. కొందరైతే ఉన్న ఆస్థిని విక్రయించి పిల్లల పెళ్లిళ్లు చేస్తుంటారు. అటువంటి వారి కోసం టీడీపీ ప్రభుత్వం హయాంలో చంద్రన్న పెళ్లి కానుక పథకాన్ని ప్రకటించారు. అమలు చేసే బాధ్యతను వెలుగు డీఆర్‌డీఏ శాఖకు అప్పగించారు. వివాహమైన కొద్దిరోజులకే నగదు మొత్తాన్ని అందించే ఏర్పాట్లు చేసేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక పథకాన్ని పట్టించుకోలేదు. దరఖాస్తు చేసుకున్నా నిధులు ఇవ్వడం లేదు. దరఖాస్తుదారుల సంఖ్య వందల్లో చేరింది. ప్రోత్సాహకం చెల్లించకపోవడంతో కొన్నేళ్లుగా కొత్తగా దరకాస్తు చేసుకున్న వారి సంఖ్య తగ్గిపోయింది. గత టీడీపీ ప్రభుత్వంలో బీసీ అయితే రూ. 35వే లు, బీసీ అయి ఉండి కులాంతర వివాహం చేసుకుంటే రూ. 50వేలు, ఎస్సీలకు రూ. 40వే లు, వధువు ఎస్సీ అయి ఉండి కులాంతర వి వాహం చేసుకుంటే రూ. 75వేలు, ఎస్సీలకు రూ. 75వేలు పెళ్లి కానుకగా అందించేవారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019 వరకూ ఎప్పటికప్పుడు సక్రమంగా చెల్లింపులు జరిగాయి. వైసీపీ వచ్చాక పథకం పడకేసింది.

● పథకాలన్నీ పునరుద్ధరిస్తాం...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వైసీపీ నిలిపేసిన గత టీడీపీ హయాంలో అమలులో ఉన్న పథకాలన్నింటీ పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ప్రకటించారు. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వంలో పెళ్లి కానుకలో కదలిక వచ్చింది. వెబ్‌సైట్ కూడ ఇచ్చారు. చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం వెబ్‌సైట్ కూడ నిలిపేశారు. దీంతో ఈ పథకం ఉందా లేదా..? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పెళ్లికానుక అమలు చేస్తారా లేదా తెలపాలని పలువురు కోరుతున్నారు.

ప్లాస్టిక్‌ను వీడి గుడ్డ సంచులు వాడండి

● టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ని వీడండి.. గుడ్డ సంచులు వాడాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం శివాజీ యూత్ ఫౌండేషన్, జానవారధి సేవా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన గుడ్డ సంచులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ యూత్ ఫౌండేషన్ ఫౌండర్, సీఈవో డాక్టర్ మోపూరు భాస్కర్‌నాయుడు 25 ఏళ్లుగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ యువతకి స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ రూరల్ సెల్ అధ్యక్షురాలు చీకవోలు శాంతి, టీడీపీ నేత జలదంకి సుధాకర్, వెలమ యువత ఫౌండేషన్ తేజ నాయుడు, స్వాన్ ఓఆర్‌జీ భానుతేజరెడ్డి, అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ కరస్పాండెంట్ పెనుబల్లి కృష్ణచైతన్య, చీకవోలు శ్రీనివాసులు, దూడల సుధీర్, 28వ డివిజన్ ఇన్‌చార్జి చెక్కా సునీల్, పామూరు సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

● పాల్కన్ సిటీ మాజీ డిప్యూటీ మేయర్



జ్యోతి వెలిగిస్తున్న ఏడుకొండలు, యానాది హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గిరిజన యువత ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అమెరికాలోని పాల్కన్ సిటీ మాజీ డిప్యూటీ మేయర్ చలంచర్ల ఏడుకొండలు అన్నారు. నగరంలోని గిరిజన భవన్‌లో గిరిపుత్ర ఫౌండేషన్, యానాది హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ కసితో, పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించగలమన్నారు. యానాది హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ ఏడుకొండలు అమెరికా నుంచి వచ్చి గిరిజన యువత అభివృద్ధి కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. గిరిజన యువత విద్య, క్రీడలు, రాకీయరంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జయభారత్ వైద్యశాల జనరల్ మేనేజర్ మారెళ్ల గురుప్రసాద్, యాకసిరి వెంకటేశ్వర్లు, బాపట్ల వెంకటపతి, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బేబీరాణి, కారుసాల సుబ్బరావమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంగోలులో జరిగిన యూనియన్ రాష్ట్ర మహాసభల్లో చివరి రోజైన ఆదివారం 89 మందితో రాష్ట్ర కమిటీని, 33 మందితో ఆఫీసు బేరర్లను ఎన్నుకున్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలోని కొత్తమ్మతల్లి ఉత్సవాలు ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా నాలుగు రోజులు పాటు జరగనున్న బాలికలు, పురుషుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు స్థానిక ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఆదివారం సాయంత్రం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు వై.వెంకన్న చౌదరి, టెక్కలి ఆర్‌డీవో ఎం.కృష్ణమూర్తి పోటీలను ప్రారంభించారు. తొలుత ప్రకాశం, నెల్లూరు బాలికల జట్లు, అనంతపురం, విజయనగరం పురుషుల జట్ల మధ్య కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో మొత్తం 12 బాలికల కబడ్డీ జట్లు, 21 పురుషుల జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, జడ్పీ సీఈవో ఎల్.వి.ఎన్.శ్రీధర్‌రాజా, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో ఫణీంద్రకుమార్, నెహ్రూ యూత్ కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఎ.చిరంజీవరావు, డీఎస్పీ లక్ష్మణరావు, జిల్లా కబడ్డీ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఆర్.అప్పలస్వామి పాల్గొన్నారు

స్వచ్ఛత అంటే ఇదేనా..!?



ప్రాంగణం చుట్టూరా ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లు

వరికుంటపాడు(ఉదయగిరిరూరల్), (ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు మండలం కాంచెరువు గ్రామ సచివాలయ ప్రాంగణం చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, నిరుపయోగ సామగ్రితో సహా ఉద్యోగులు ఉండే గదుల్లోను అపరిశుభ్రత విలయతాండవం చేస్తోంది. విలువైన సామగ్రిని సైతం భద్రపరచకుండా ఓ గదిలో చిందర వందరగా పడేయడంతో అవి తుప్పు పట్టి నాశనమవుతున్నాయి. ఇదే స్వచ్ఛత అంటూ ప్రజలు ఉద్యోగులను నిలదీస్తున్నారు.

బోగోలులో కుండపోత వర్షం

బిట్రగుంట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కుండపోతగా వర్షం కురిసింది. సీఎల్‌పురంలో వరిపైరు నేలకు ఒరిగింది. చేతికి అందాల్సిన ధాన్యం నేలపాలు అవుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతలు పూర్తి కావస్తున్నా ఇంతవరకు సీఎంఆర్ ప్రారంభించక పోవడం రైతులకు శాపంగా మారిందంటున్నారు. చెంచులక్ష్మీపురం పరిసర ప్రాంతాలోనే ఇంకా 50 ఎకరాలకు పైగా వరి కోతలు జరగాల్సి ఉందని స్థానిక రైతులు తెలిపారు.

బీఎంఆర్ ట్రస్ట్ వైద్యశిబిరం

అల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపల్లిలో ఆదివారం బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సోమశిల కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ నేతృత్వంలో నెల్లూరులో ప్రముఖ నరాల సంబంధిత వైద్య నిపుణులు బిందుమీనన్ ఫౌండేషన్ సౌజన్యంతో శిబిరం ఏర్పాటుచేసి స్థానికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాటి రంజిత్, ఉప సర్పంచ్ పావనబోయిన జగన్మోహన్, పంచాయతీ కార్యదర్శి తెనాలి మురళీకృష్ణ, రవ్వా హరికుమార్, వట్టూరు మస్తానయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల పని గంటల పెంపు దారుణం

ఉలవపాడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కార్మికుల పని గంటలు రోజుకు 8 నుంచి 13కు పెంచుతూ శాసనసభలో తీర్మానం చేయడం అన్యాయమని సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని ఒక్క కలం పోటుతో రద్దు చేయడం దారుణమన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కందుకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరమని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు రూ.20.57 లక్షల విలువ గల చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులకు కూడా చికిత్స చేయించుకునేందుకు ప్రభుత్వం చేయూత అందిస్తుందన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయమన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే ఇంటూరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు, లింగసముద్రం, కందుకూరు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మకు పాల పొంగళ్లు

లింగసముద్రం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ దేవత ఆలయంలో పాల పొంగళ్ల వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆలయం నిర్మించి 41 రోజులైన సందర్భంగా గ్రామస్తులు ఈ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పాలతో గంగమ్మ తల్లికి అభిషేకం చేశారు. వర్షాలు విరివిగా కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా కలగాలని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఎదుట ఉన్న పోతురాజు విగ్రహానికి కూడా భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బందోబస్తు నిర్వహించిన ఎస్‌ఐ ఎం నారాయణ, సిబ్బందిని ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు సత్కరించారు.

రోడ్డు వేశారు.... కాలువల నిర్మాణం మరిచారు !

కావలి,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం కొత్త శివాలయం నుంచి ఇందిరమ్మ కాలనీలకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మించటాన్ని అందరూ అభినందిస్తున్నారు. అయితే ఆ రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించక పోవటంతో వర్షపునీరు నిలిచి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కావలిలో కురిసిన ఓ మోస్తరు వర్షానికి ఆ సీసీ రోడ్డు వెంబడి వర్షపు నీరు నిలవటమే కాక కాలనీ వాసుల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. వాస్తవంగా వెంగళరావునగర్ కొత్త శివాలయం నుంచి ఇందిరమ్మ కాలనీలకు వెళ్లే రోడ్డు మార్గంలో బీఈడీ కాలేజీ మీదుగా వచ్చే వర్షపునీరు దిగువకు వచ్చి తుఫాన్‌నగర్, బాలక్రిష్ణారెడ్డి నగర్ మీదుగా మందాటి చెరువులో కలుస్తాయి. అయితే ఆ నీరు వచ్చే మార్గంలో




ఇందిరమ్మ కాలనీలో రోడ్డు పక్కన, నివాసాల మధ్య నిలిచిన వర్షపు నీరు

సీసీ రోడ్డు వేశారు కాని దానికి రెండు పక్కలా కాలువలు నిర్మించక పోవటంతో వర్షపునీరు పారుదలకు ఆటంకం ఏర్పడి ఆ ప్రాంతం జలమయం అవుతోంది. అలాగే పడమర వైపు నుంచి తూర్పు వైపునకు వర్షపునీరు వచ్చేందుకు రోడ్డుకు అక్కడక్కడ వేసిన తూములు కూడా వాటి సామర్థ్యం చాలకపోవటంతో నీరు తూర్పు వైపునకు సక్రమంగా రావటంలేదు. అధికారులు వెంటనే ఆ రోడ్డుకు రెండు వైపులా కాలువలు నిర్మించి కాలనీలో నీరు నిల్వకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రైల్వే మైదానంలో ఓపెన్ జిమ్ ప్రారంభం

బిట్రగుంట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యాయామం, క్రీడలతో ఆరోగ్యంగా ఉండవచ్చని బిట్రగుంట రైల్వే పీడబ్ల్యూఐ రాజ్ కుమార్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో బచ్చు అమరా ట్రస్ట్



జిమ్‌ను ప్రారంభిస్తున్న రాజ్‌కుమార్

వ్యవస్థాపకుడు బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతుల దాతృత్వంతో ఏర్పాటు చేసిన ఓపెన్ మినీ జిమ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యుల కోరిక మేరకు మినీ జిమ్, చిన్నారులు ఆడుకునే జారుడు బండ, అప్ అండ్‌డౌన్ స్టాండ్స్ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసినందుకు అమరా ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఆనందసాగర్‌ను సన్మానించారు. జిమ్ కోసం కృషి చేసిన రైల్వే లోకో పైలెట్ పీ జీవన్‌కుమార్, వాకర్స్ అధ్యక్షుడు బీ బ్రాడ్, కోశాధికారి ఎం శ్రీనివాసులును వాకర్స్ తైక్వాండో మాస్టర్ రవిగన్ అభినందించారు. రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ బిట్రగుంట సెక్రటరీ రాజశేఖర్ పాల్గొన్నారు.

శివాలయం, విష్ణాలయంలో నేటి నుంచి 'నవరాత్రులు'

కావలి,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని పాతూరు శ్రీదుర్గాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (శివాలయం), విష్ణాలయంలో సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈవో రాధాక్రిష్ణ, అర్చకులు తెలిపారు. వారు ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని వేరు వేరుగా కలిసి నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు. తప్పక పాల్గొంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ ఈవో, పూజారులు తదితరులు

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల భేటీ

ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షునిగా ఎన్నికైన దేవర కొండ శ్రీనివాసులు ఆదివారం యూనియన్ నాయకులతో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మికులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి నాయకులు కృషిచేయాలని ఎమ్మెల్యే కోరారు. యూనియన్‌కు, నాయకులకు అండగా ఉంటానని చెప్పారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాల ప్రారంభం



కలిగిరి, సెప్టెంబరు21(ఆంధ్యరజ్యోతి): మండలంలోని తెల్లపాడు గ్రామంలోని భద్రకాళీ అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22 నుండి అక్టోబరు 2 వరకు వైభవంగా జరుగుతాయని ఆలయ ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. దేవస్థానం అర్చకులు రమణదీక్షితులు ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాల మొదటిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారన్నారు. భక్తులు తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

ఎమ్మెల్యే ఇంటూరికి ఆహ్వానం

కుందుకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కమిటీ సభ్యులు ఆదివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవీ నవరాత్రులు భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతికి ప్రతీకని, అమ్మవారి ఆశీర్వాదం పట్టణ ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు.

ఘనంగా గురజాడ జయంతి

కావలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యో తి): సాహిత్యప్రక్రియలను వ్యవహార భాష ఆవశ్యకతను తెలుగు వారికి తెలియచెప్పిన మహోన్నతుడు గుర జాడ అప్పారావు అని తెలుగు ధ్యాన పీఠం అధ్యక్షుడు డాక్టర్ జిల్లా శ్రీనివా సరావు, లోక్‌అదాలత్ సభ్యుడు ఎం. మాలకొండారెడ్డి అన్నారు. ఆదివారం కావలి పట్టణంలో ఎస్‌బీఐ పక్కను న్న క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ కల్యా ణ మండపంలో గురజాడ జయంతి కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్ర్యమంలో రాపూరు సుబ్బారావు, మహిళలు పాల్గొన్నారు.



గురుజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాలకొండారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు

కందుకూరులో...

కందుకూరు, సెప్టంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సిద్దార్థ స్కూల్లో ఆదివారం గురజాడ వేంకట అప్పారావు జయంతి సభను ఆదివారం నిర్వహించారు. గురజాడ జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ మాల్యాద్రి మాట్లాడుతూ కన్యాశుల్కం వంటి దురాచారాన్ని రూపుమాపి మహిళల జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుడు గురజాడ అని కొనియాడారు. ఆయన రాసిన దిద్దుబాటు కథ, పూర్ణమ్మ గేయం, దేశభక్తి గేయాలు తెలుగు భాషకు తలమానికాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టీవీవీ కృష్ణకుమార్, మండల కార్యదర్శి శరత్‌బాబు, స్కూల్ కరస్పాండెంట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

అల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని మండల విద్యాశాఖాధికారి రవీంద్ర అన్నారు. అపస్మా ఆధ్వర్యంలో మండలంలోని నార్తుమోపూరు పరిధిలోని ఇందుపూరు కాలువ వద్ద డీఎస్‌ఆర్ ట్రస్ట్ వేదికపై నిర్వహించిన నియోజకవర్గంలోని అన్‌ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన సభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో 24 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ట్రెజరర్ పి కృష్ణారావు, జిల్లా కార్యదర్శి ఎస్ రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కె శివకుమార్, మొహమ్మద్ మజహర్, జె గోపాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న అపస్మా సభ్యులు

హోంశాఖ మంత్రి అనితను సత్కరించిన టీడీపీ నేతలు

కందుకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను ఆదివారం తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం, శాలువాతో మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో మండల తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్, టంగుటూరు మండలం ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చక్రవర్తి, ఏసుపోగు యోహాను, చాట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



హోం మంత్రి అనితను సన్మానిస్తున్న మోషే, నాయకులు

కబడ్డీ ఛాంపియన్ ఆత్మకూరు ఎస్‌ఆర్‌జే టీమ్



కబడ్డీ పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచిన ఎస్‌ఆర్‌జే డిగ్రీ కళాశాల జట్టు

ఆత్మకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ ఎస్‌ఆర్‌జె డిగ్రీ కళాశాలలో గత రెండురోజుల నుంచి జరుగుతున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల్లో ఎస్‌ఆర్‌జె డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌గా నిలిచారు. నెల్లూరుకు చెందిన జెనెక్స్ కళాశాల రన్నర్‌గా నిలిచింది. అదేవిధంగా చెస్ పోటీల్లో సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీమ్ చాంపియన్‌గా నిలిచింది. రన్నర్‌గా రావూస్ కళాశాల టీమ్. అనంతరం బహుమతి ప్రధాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ వెంకటేశ్వర్లు, యూనివర్శిటీ పరిశీలకులు డా. పి ప్రసాద్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, రమణయ్య, వెంగళరావు, సతీష్, రవీంద్ర, అంకమ్మ, సుప్రియ, వివిధ కళాశాలల పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగులపై పీడీ మండిపాటు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న దుత్తలూరు ఉపాధి హామీ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందిపై డ్వామా పీడీ గంగాభవాని మండిపడినట్లు తెలిసింది. ఇటీవల కార్యాలయంలో ఈసీ, టీఏలు తీవ్ర వాగ్వివాదానికి దిగి బూతులు తిట్టుకోవడాన్ని మరవకముందే శుక్రవారం కార్యాలయ తలుపులు తెరిచిన ఉద్యోగులు, సిబ్బంది శనివారం వరకు పట్టించుకోకపోవడంపై వివిధ పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో పీడీ ఉద్యోగికి ఫోన్ చేసి తీవ్రస్థాయిలో మందలించినట్లు సమాచారం. ఇకపై ఇలాంటి తప్పిదాలు చోటుచేసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది.

అధ్వానంగా దత్తాత్రేయస్వామి గుడి రోడ్డు



ఎస్సీ కాలనీ వద్ద బురదమయమైన రహదారి

లింగసముద్రం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని మొగిలిచెర్ల ఎస్సీ కాలనీ నుండి దత్తాత్రేయస్వామి గుడికి వెళ్లే రోడ్డు బురదమయమైంది. నడవడానికి కూడా వీలు లేకుండా అధ్వాన్నంగా మారింది. దీంతో గుడికి వెళ్లలేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ కాలనీ నుండి సుమారు రెండు ఫర్లాంగుల మేర ఉన్న ఈ మట్టి రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉంటోంది. బురదమయం కావడంతో గుడికి కాలినడకన, ద్విచక్ర వాహనాల్లో వెళ్లే భక్తులు ఇబ్బందిపడుతున్నారు. 2 కి.మీ పొడవున తారు రోడ్డుపై మెటల్ లేచిపోవడంతో అసౌకర్యంగా మారింది. కొందరు వ్యక్తులు రోడ్డు పగులగొట్టి పైపులు వేసుకున్నారు. పైర్లకు నీరు పెట్టుకొని తర్వాత అలాగే వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, భక్తులు కోరుతున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన సంగమేశ్వరాలయం



దసరా ఉత్సవాలకు ముస్తాబైన మానసాదేవి ఆలయం

● నేటినుంచి ప్రారంభం

సంగం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా సంగమేశ్వరాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా కామాక్షిదేవి అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సోమవారం ఉదయం కలశ స్థాపన, సాయంత్రం బాలా త్రిపుర సుందరిదేవి అలంకారం, 23న గాయత్రీ దేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కాత్యాయని దేవి, 26న లక్ష్మీదేవి, 27న సంతానలక్ష్మి, 28న చండిదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసురమర్ధిని, 2న రాజ రాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అదేవిధంగా ఆలయంలో ప్రతి రోజు ప్రత్యేక పూజలు, పూలంగిసేవ, పల్లకీసేవ జరుగుతాయని భక్తులు అధికసంఖ్యలోపాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కార్యనిర్వాహణాధికారి రఘురామయ్య తెలిపారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహిసున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో నిర్వహించే మహోత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు శైలిపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. అలాగే 23న బ్రహ్మచారిణి, 24న చంద్రఘంట, 25న కూష్మాండదుర్గ, 26న స్కందమాత, 27న కాత్యాయని, 28న కాళరాత్రి, 29న సరస్వతిదేవి, 30న మహాగౌరి అలంకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే అక్టోబరు 1వ తేదీన సిద్ధిరాత్రి, 2న మానసాదేవిగా భక్తులకు దర్శనం ఇస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు.



ఉదయగిరి పట్టణంలో కొలువైన సంతానలక్ష్మి అమ్మవారు

●**ఉదయగిరి:** పట్టణంలోని పార్వతీ పరమేశ్వర, సంతానలక్ష్మి ఆలయాలు, స్థానిక బాలాజీ నగర్‌లో సోమవారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆదివారం నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. 11 రోజులపాటు రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. ఉదయం, సాయంత్రం విశేష పూజలు జరుగుతాయన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

●**సీతారామపురం :** మండలంలోని ఘటిక సిద్దేశ్వర క్షేత్రం, సీతారామపురంలోని నారాయణంపేట దుర్గాదేవి ఆలయం, సీతారామపురంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా న్విహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 22న సిద్ధేశ్వరీదేవి, 23న బాలాత్రిపుర సుందరీదేవి, 24న గాయత్రీదేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న మహలక్ష్మీదేవి, 27న కాత్యాయనీదేవి, 28న లలితా త్రిపురసుందరీ దేవి, 29న సరస్వతీదేవి, 30న మహాదుర్గాదేవి, 1న మహిషాసురమర్ధిని, 2న రాజరాజేశ్వరీదేవి అలంకారాలలో ఇష్టకామేశ్వరీదేవి, దుర్గాదేవి, శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



నాగారపమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

బీజేపీ నేతల రక్తదానం



దుత్తలూరులో రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపడుతున్న సేవా పక్వాడ్ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో బీజేపీ నాయకులు, యువత అధికసంఖ్యలో పాల్గొని రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు లెక్కల వెంగళరెడ్డి, మేకపాటి మాల్యాద్రినాయుడు, చుండి హరి గోపాల్ రెడ్డి, అందె రామయ్య, శివపార్వతి, మూలె బాలకృష్ణారెడ్డి, కదిరి రంగారావు, పెనల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం

● పొంచి ఉన్న ప్రమాదం



ఒరిగిన విద్యుత్ స్తంభం

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్ సమీపాన నందిపాడు మార్గంలో 565 జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలాల్లో 11 కేవీ విద్యుత్ స్తంభం ఒరిగిపోయి కూలే దశలో ఉంది. గాలులకు స్తంభం నేలకొరిగితే ప్రమాదాలు సంభవించే అవకాశముందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. స్తంభానికి సమీపంలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అని, ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాన్ని మార్చాలని రైతులు కోరుతున్నారు.

కుమార్తెను స్మరించుకుంటూ..!


లక్ష్మణ్, సుబ్బాయమ్మ దంపతులు (ఫైల్ ఫొటో)

- పిండ ప్రదానం చేయడానికి వెళుతూ మార్టూరు వద్ద రోడ్డు ప్రమాదం
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి దుర్మరణం
- కొరమేనుగుంటలో విషాదం


ప్రమాదంలో దెబ్బతిన్న కారు


ప్రమాద స్థలంలో గణేష్ బాబు, పద్మజ దంపతులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పదేళ్ల కిందట మృతిచెందిన కుమార్తె గీతను స్మరించుకుంటూ.. కోటిలింగాల రేవులో పిండ ప్రదానం చేయడానికి బయలుదేరిందా కుటుంబం. బాపట్ల జిల్లా మార్టూరు సమీపంలోని కోళ్లపూడి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం.. ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలో నింపింది. ఆ కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడటంతో తిరుపతి నగరం కొరమేనుగుంటలో విషాదం నెలకొంది. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన దామెర్ల లక్ష్మణ్, ఆయన భార్య సుబ్బాయమ్మ రెండు దశాబ్దాల కిందట తిరుపతికి వలసొచ్చారు. పోస్టల్ కాలనీలో ఉంటూ రేడియేటర్లు రిపేరు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు దామెర్ల గణేష్‌బాబు కొరమేనుగుంటలో నివాసం ఉంటూ, ఆటోనగర్‌లో మెకానిక్ షెడ్డు పెట్టుకున్నారు. ఇతడికి భార్య పద్మజ, కుమారులు హేమంత్, పవన్ ఉన్నారు. చిన్నకుమారుడు ధనంజయతోపాటు లక్ష్మణ్ దంపతులు ఉంటున్నారు. ఈయన కుమార్తె గీత పదేళ్ల కిందట మృతిచెందారు. ఆమెను స్మరించుకుంటూ ఏటా తిరుపతి లోఉని కపిలతీర్థంలో పిండ ప్రదానం చేసేవారు. ఈ ఏడాది మహాలయ అమావాస్య కావడంతో పెద్దల సూచన మేరకు పిఠాపురంలోని కోటిలింగాలలో పిండ ప్రదానం చేయాలని భావించారు. దీనికోసం శనివారం రాత్రి 10.30 గంటలకు తన పెద్ద కుమారుడు దామెర్ల గణేష్ బాబు, కోడలు పద్మజ, భార్య సుబ్బాయమ్మ, మనుమడు హేమంత్‌తో కలసి లక్ష్మణ్ కారులో బయలుదేరారు. బాపట్ల జిల్లా మార్టూరు సమీపంలోని కోళ్ళపూడి జాతీయ రహదారిపై కారుకు అడ్డంగా కుక్క రావడంతో దాన్ని తప్పించబోయి పక్కనే వున్న డివైడర్‌ను కారు ఢీకొనడంతో లక్ష్మణ్, సుబ్బాయమ్మ దంపతులు, వారి మనుమడు హేమంత్ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన గణేష్‌బాబు, పద్మజ దంపతులకు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. ప్రమాదంలో కారులో ఎయిర్ బెలూన్లు తెరుచుకున్నప్పటికీ ముగ్గురు ప్రాణాలను కోల్పోయారు. ఈ ప్రమాదం విషయం తెలియగానే మృతుల బంధువులు చీరాల, వేటపాలెం, వినుకొండ నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. గాయపడిన వారికి గుంటూరులో చికిత్స అందించగా, సాయంత్రానికి వీరు తిరుపతికి చేరుకున్నారు. ముగ్గురి మృతదేహాలకు మార్టూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆదివారం రాత్రికి మృతదేహాలు ఇంటికి చేరడంతో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి.

ఆవిరైన ఆనందం : హేమంత్ (25) కొంత కాలంగా ఓ విద్యా సంస్థలో లెక్చరర్‌గా పనిచేసే వారు. ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఆయన ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. త్వరలో ఉపాధ్యాయ వృత్తిలో జీవితం కొనసాగించాల్సిన హేమంత్ ఈ ప్రమాదంలో అసువులు బాశారు. దీంతో టీచరు ఉద్యోగం వచ్చిన ఆనందం ఆ కుటుంబంలో ఆవిరైంది.


హేమంత్ (ఫైల్ ఫొటో)

బాధాకరం

'హేమంత్‌కు ఈ మధ్య టీచర్ జాబ్ వచ్చి అపాయింట్‌మెంట్ లెటర్ కూడా తీసుకున్నాడు. ఒకటో తేది ఉద్యోగంలో జాయిన్ అవ్వాల్సిన టైమ్‌లో చనిపోవడం చాలా బాధాకరం'అని కొరమేనుగుంటకు చెందిన జనార్దన్ పేర్కొన్నారు.'మేము బయటకు వెళుతున్నాం.ఆదివారం ఉదయం ఇంటికి పాలు అవసరంలేదు' అని ఫోను చేసి హేమంత్ చెప్పారని బత్తెమ్మ గుర్తుచేసుకున్నారు. అదే ఆఖరి మాట అవుతుందనుకోలేదన్నారు.

24న తిరుమలకు సీఎం రాక

- ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో తిరుపతికి
- మూడుచోట్ల హెలిప్యాడ్‌లు పరిశీలన
- వర్షం వస్తే ప్రత్యామ్నాయం వైపు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకుని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అమరావతి నుంచి బుధవారం సాయంత్రం హెలికాప్టర్‌లో బయలుదేరి తిరుపతి 4.45గంటలకు చేరుకోనున్నారు. నుంచి నేరుగా హెలిక్యాప్టర్‌లో బయలుదేరి తిరుపతికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లనున్నారు. ధ్వజారోహణ అనంతరం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. రాత్రికి జరిగే స్వామివారి పెద్ద శేష వాహనసేవలో పాల్గొంటారు. గురువారం ఉదయం పీఏసీ-5 భవనాన్ని ప్రారంభిస్తారు. 10.45గంటలకు తిరుపతి నుంచి తిరిగి సీఎం చంద్రబాబు అమరావతికి బయలుదేరి వెళ్లనున్నారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అలిపిరిసమీపంలో దేవలోక్, భారతీ విద్యాభవన్ పాఠశాల మైదానం, ఎస్వీ అగ్రికల్చర్ కళాశాల మైదానాన్ని హెలిప్యాడ్ కోసం అధికారులు పరిశీలించారు. ఒకవేళ వర్షమొస్తే గన్నవరం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో సీఎం చంద్రబాబు చేరుకుని.. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లే ఏర్పాట్లు పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారంరాత్రి ఆంధ్రజ్యోతికి తెలిపారు.

కపిలతీర్థం.. కిక్కిరిసిన భక్తజనం

- పిండ ప్రదానం చేయడానికి తరలి వచ్చిన జనం
- స్వల్ప తోపులాట, భారీ బందోబస్తు





తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య.. ఆదివారం. ఇలా చాలా ఏళ్లకు ఒకసారి వచ్చే దినం. దీంతో తిరుపతిలోని కపిలతీర్థంలో తమ పూర్వీకులు, పెద్దలకు పిండ ప్రదానం చేయడానికి తరలివచ్చారు. ముందస్తుగా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. అయితే ఊహించని విధంగా వేలాది మంది ఒక్కసారిగా రావడంతో పోలీసులకు సైతం భక్తులను నియంత్రించడం కష్టంగా మారింది. దీంతో ఆలయం ప్రధాన ద్వారం వద్ద నంది సర్కిల్ నుంచి ఆలయంలోకి వెళ్లే రోడ్డుపై కొంత తోపులాట చోటు చేసుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్పీ సుబ్బరాయుడు అక్కడకు చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. ఏమాత్రం కాస్త అజాగ్రత్తగా ఉన్నా పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. కాగా, తోపులాటను కాస్త తొక్కిసలాటగా మీడియాలో ప్రచారం కావడంతో అప్రమత్తమైన పోలీసులు భారీ సంఖ్యలో ఎస్టీఎఫ్ పార్టీలను అక్కడకు మోహరించారు. బ్యారికేడ్లు ఏర్పాటు చేసి క్యూ పద్ధతిలో లోనికి అనుమతించడంతో రద్దీ తగ్గింది. కాగా, కపిలతీర్థం వద్ద 200 మందిపైగా పురోహితులు పిండ ప్రదాన కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తుల భద్రతకు కట్టుదిట్టమైన పర్యవేక్షణ

కపిలతీర్థం వద్ద ఎలాంటి తొక్కిసలాట జరగలేదని ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ నియంత్రణకు అదనపు బందోబస్తు ఏర్పాటు చేశాం. వాహనాల పార్కింగ్ స్థలం పరిమితంగా ఉండటంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. ఆలయ పరిసరాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. కొన్ని సోషల్ మీడియాల్లో తొక్కిసలాట జరిగినట్లు ప్రసారమైన వార్తలు పూర్తిగా అవాస్తవం. నిజమైన సమాచారం కోసం పోలీసు శాఖ అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలి' అని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కాగా, ఓంకార్ అనే వ్యక్తి ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్తలు, ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేశారని అలిపిరి సీఐ పేర్కొన్నారు. ఇలా భక్తుల్లో భయాందోళన సృష్టించిన ఆయనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


కపిలతీర్థం వద్ద భక్తుల భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ


జెండా ఉత్సవాల వద్ద జనసందోహం




ఆంజనేయస్వామి జెండా

ఘనంగా జెండా ఉత్సవం

గూడూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గూడూరులో ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలు ఆదివారం రాత్రి శోభాయమానంగా జరిగాయి. ఎటుచూసినా జనసంద్రంగా మారింది. విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. వివిధ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన అంజనీపుత్రుడి జెండాలను ట్రాక్టర్లపై ఉంచి పట్టణంలో ఊరేగించారు. వాడవాడలా జరిగిన ఈ ఊరేగింపు ముందు బ్యాండు మేళాలు, తప్పెట్లు, జింగిరి మేళం, కోలాటాలు, భేతాళ, కాంతార నృత్యాలు, మంగళవాయిద్యాలు, కేరళ బ్యాండు విన్యాసాలు, యువత చిందులతో సందడి చేశారు. తొలుత బజారువీధిలోని కలిశంకొట్టుపై గ్రామజెండా ప్రతిష్ఠాపన తొలుత సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ముందుగా కలిశంకొట్టు వద్ద అంజనేయస్వామి జెండాకు పూజలు నిర్వహించి... ఈ జెండాను పట్టణ పొలిమేర్లలో తిప్పి తిరిగి తీసుకొచ్చి కలిశం కొట్టు వద్ద ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరపడంతో జెండా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆంజనేయ స్వామి జెండాలకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. పట్టణంలో వివిధ అమ్మవారి ఆలయాల్లో సోమవారం కలశ స్థాపనతో శరన్నవ రాత్రులను ప్రారంభించనున్నారు.

వెరీగుడ్.. కీపిటప్

- కలెక్టర్‌కు, యంత్రాంగానికి సీఎం అభినందనలు



స్కోచ్ అవార్డు పోస్టర్ ముందు కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్వర్ణనారావారిపల్లె ప్రాజెక్టుకు ప్రతిష్టాత్మక స్కోచ్ సంస్థ నుంచి గోల్డెన్ అవార్డును అందుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ప్రాజెక్టులో పాలుపంచుకున్న అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదివారం ఎక్స్ వేదికగా అభినందించారు. కేవలం 45రోజుల వ్యవధిలోనే మొత్తం 1,600 ఇళ్లకు సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగులను నింపారు. కర్బన ఉద్గారాల తగ్గింపులో భాగంగా హరిత స్వర్ణాంధ్ర లక్ష్యంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్టులో ఉచితంగా ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్‌నుఏర్పాటు చేశారు. మొత్తం 3,396 కిలోవాట్ల సామర్థ్యంతో ఏడాదికి 4.89 మిలియన్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. రూ.3.39కోట్ల విద్యుత్ సోలార్ రూఫ్ టాప్ ద్వారా ఉత్పత్తి కానుంది. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టు ద్వారా సౌరశక్తి ప్యానెళ్లను ప్రతి ఇంటిపై ఉచితంగా ఏర్పాటు చేశాయి. అన్ని ఇళ్లకూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసి మొత్తం గ్రీన్ ఎనర్జీని వినియోగిస్తున్న తొలి గ్రామంగా ప్రతిష్టాత్మక స్కోచ్ సంస్థ గోల్డెన్ అవార్డును ప్రకటించింది. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఈ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. దీనిపై సీఎం చంద్రబాబునాయుడు ఎక్స్ వేదికగా గ్రామస్తులకూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో సహకరించిన ప్రజలు, అధికారులకు అభినందనలు తెలిపారు.

పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పోలీసు పీజీఆర్ఎస్ వివిధ కారణాల రీత్యా రద్దు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంతో పాటు తిరుపతికి ప్రముఖులు తాకిడి ఎక్కువగా ఉన్నందున రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో సమీప పోలీసు స్టేషన్లకు వెళ్ళి పిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- స్విగ్గి డెలివరీ బాయ్ మృతి


మునిరెడ్డి (ఫైల్ ఫొటో)


ప్రమాద స్థలం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో స్విగ్గి డెలివరీ బాయ్‌గా పని చేసే మునిరెడ్డి మృతి చెందారు. శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ వద్ద తిరుపతి రహదారిపై ఆదివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. పట్టణంలోని కొండమిట్టకు చెందిన మునిరెడ్డి స్విగ్గి యాప్ ద్వారా ఆహార పదార్థాలను డోర్ డెలివరీ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శ్రీరామ్ నగర్ కాలనీ సమీపంలో ఓ హోటల్లో నగదు జమ చేసేందుకు వెళ్తుండగా శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఇతడి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ముని రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆదాయం కోసం వెంపర్లాట

- బదిలీ అయినా డిప్యూటేషన్ కోసం పైరవీలు
- పంచాయతీ కార్యదర్శుల తీరుపై విమర్శలు

తిరుపతి(కలెక్టరేట్),సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ప్రగతికి అవరోధంగా ఉన్న విధానాలను పక్కనబెట్టి పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకొచ్చింది.జనాభా, ఆదాయం ఆధారంగా చేసుకుని పంచాయతీలను గ్రేడ్‌లుగా విభజించింది. జిల్లాలో 774 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో మేజర్ పంచాయతీలు సుమారు 30 ఉన్నాయి.ప్రతి పంచాయతీకి గ్రేడ్‌ల వారీగా కార్యదర్శులు ఉండే విధంగా చర్యలు తీసుకుంది. మేజర్ పంచాయతీలకు సీనియారిటీ ప్రాతిపాదికన పంచాయతీ కార్యదర్శులను నియమించింది. అయితే ఆదాయం ఎక్కువగా ఉండే తిరుపతి, శ్రీకాళహస్తి, రేణిగుంట, గూడూరు పట్టణాలకు సమీపంలో ఉన్న పంచాయతీల్లో పోస్టింగ్‌లపై పలువురు కార్యదర్శులు దృష్టి పెట్టారు. డిప్యూటేషన్ పేరుతో అక్కడికి మకాం మార్చేందుకు రాజకీయ నాయకుల ద్వారా పైరవీలు చేస్తున్నారు. అర్హత లేకున్నా వారం రోజులుగా కలెక్టరేట్ చుట్టు చక్కర్లు కొడుతున్నారు. పదేపదే అధికారులపై ఒత్తిడి తెస్తుండటంతో వారు తలలు పట్టుకుంటున్నారు. గతంలో తిరుచానూరు, కరకంబాడి, రేణిగుంట, చంద్రగిరి, శ్రీకాళహస్తి,సత్యవేడు, గూడూరు నియోజకవర్గాల్లో బిల్లు కలెక్టర్లతో కలిసి కోట్లాది రూపాయాలు స్వాహా చేయడం, వారి నుంచి ప్రభుత్వం రికవరీ చేయడం తెలిసిందే.అలాంటి వారే మళ్లీ డిప్యూటేషన్లు కోరుతున్నారన్న విమర్శలున్నాయి.



టీటీడీకి కానుకగా క్లీనింగ్ యంత్రాలు

టీటీడీకి ఆదివారం 18 క్లీనింగ్ యంత్రాలు కానుకగా అందాయి. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్)లో భాగంగా ఐడీబీఐ బ్యాంకు రూ.19 లక్షల విలువైన 18 క్లీనింగ్ యంత్రాలను అందజేసింది. ఆదివారం ఉదయం ఆలయం ముందు ఈ యంత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బ్యాంకు ఎండీ, సీఈవో రాకేష్ శర్మ ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు. డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఐడీబీఐ రీజనల్ హెడ్ సాయికృష్ణ, బ్రాంచ్ హెడ్ మేనేజర్ రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీకి రైడ్ ఆన్ స్వీపర్ మిషన్ విరాళం

తిరుమల, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి ఆదివారం రూ.20 లక్షల విలువైన రాస్ స్ట్రీట్ ఆర్‌ఓ 1500 రైడ్ ఆన్ స్వీపర్ మిషన్ విరాళంగా అందింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మల్టీ పర్పస్ క్లీనింగ్ కోసం ఉపయోగించేందుకు ఈ మిషన్‌ను అందజేసింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఆలయం ముందు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి బ్యాంక్ జీఎం పత్రి శ్రీనివాస్ మిషన్‌ను అందజేశారు. అనంతరం అదనపు ఈవో ఈ మిషన్‌ను కొద్ది దూరం నడిపి పనితీరును పరిశీలించారు.




శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.4.59 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,042

తలనీలాలు సమర్పించినవారు: 23,393





డ్రగ్స్‌కు నో చెబుదాం జీవితాలను కాపాడుకుందాం

- యువతకు పిలుపునిచ్చిన ఎస్పీ సుబ్బరాయుడు
- ఘనంగా నమో యువరన్ 3కె ర్యాలీ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'డ్రగ్స్‌కు నో చెబుదాం. విలువైన జీవితాలను కాపాడుకుందాం. డ్రగ్స్ నిర్మూలనకు పోరాడుదాం. నవయుగ భారత్‌ను నిర్మిద్దాం' అంటూ ఎస్పీ సుబ్బరాయుడు యువతకు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బీజేవైఎం అధ్వర్యంలో ఆదివారం 'నమో యువ రన్ 3కె ర్యాలీ' ఆదివారం తిరుపతిలో జరిగింది. మత్తు పదార్థాలు శరీరానికి హాని చేయడంతో పాటు జీవితాలనూ నాశనం చేస్తాయని ఎస్పీ వివరించారు. ఒక్కసారి అలవాటుపడితే సర్వం కోల్పోతారన్నారు. ఎవరికైనా డ్రగ్స్ వాడినా, అమ్మినా ఆ వివరాలను రాష్ట్ర టోల్ ఫ్రీ నెంబరు 1972కు, తిరుపతి జిల్లా నెంబరకు 1908కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. యుతను జాగృతం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని బీజేపీ రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి తెలిపారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి బాలాజీ కాలనీ, గాంధీరోడ్డు, తిలక్‌రోడ్డు మీదుగా తుడా ఇందిరా మైదానం వరకు కే రన్ సాగింది. వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, యువమోర్చా నాయకులు హరికృష్ణ, పృథ్వీ, కిషన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అలాగైతే అలిపిరిలో తల నరుక్కుంటా: భూమన



తిరుపతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరకామణికి సంబంధించి తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో ఘటన జరిగి ఉంటే అలిపిరి వద్ద తల నరుక్కుంటానని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి వ్యాఖ్యానించారు. అలా కాని పక్షంలో లోకేశ్, బీఆర్ నాయుడు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కొందరు సీసీ ఫుటేజ్ అంటూ హడావుడి చేస్తున్నారు. గత 20 ఏళ్లుగా పరకామణిలో రవికుమార్ చోరీ చేస్తున్నారని అంటున్నారు. అలా జరిగి ఉంటే గత చంద్రబాబు పాలనలో 15 సంవత్సరాలకు సంబంధించిన సీసీ ఫుటేజీని ఎందుకు బయట పెట్టడంలేదు. రవికుమార్‌ను మా ప్రభుత్వ హయాంలోనే పట్టుకున్నాం. ఈ ఘటనకు సంబంధించి ప్రాయశ్చిత్తంగా అతడి నుంచి రూ.14 కోట్ల మార్కెట్ విలువ చేసే ఆస్తులను టీటీడీకి అప్పగించడం జరిగింది. ఆ ఆస్తి విలువ రూ.100కోట్ల వరకు ఉంటుంది. సీబీసీఐడీ కాదు సీబీఐ చేత విచారణ జరిపించండి. ఏ విచారణనైనా ఎదుర్కొంటాం' అని పేర్కొన్నారు.

సెటిల్మెంట్ చేయడానికి మీరెవరు?

- భూమనకు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్న



తిరుపతి(ఎంఆర్‌పల్లె), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'శ్రీవారి పరకామణిలో రవికుమార్ దొంగిలిస్తే మిగిలిన గజదొంగలు పంచుకున్నారు. ఆ దొంగ సొత్తును సెటిల్‌మెంట్ చేయడానికి మీరెవరు? మీకేం అర్హత ఉంది' అంటూ భూమన కరుణాకరరెడ్డిని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పరకామణి చోరీ గురించి తనకు ఏం సంబంధంలేదని భూమన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రవికుమార్‌పై కేసు పెట్టినప్పటినుంచి భూమన టీటీడీ పాలకమండలిలో ఉన్నారన్నారు. పరకామణి దొంగతనంపై సాక్ష్యాధారాలతో బయటపెట్టినప్పటి నుంచి ఆయనలో భయం పట్టుకుందన్నారు. రవికుమార్‌నుంచి భూమన రూ.400కోట్లు తీసుకున్నారన్నారు. భూమన టీటీడీ చైర్మన్‌గా ఉన్నపుడు స్విమ్స్‌లో మందుల షాపుల కాంట్రాక్టరు నుంచి కూడా ముడుపులు తీసుకున్నారని, త్వరలోనే అన్ని వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.

గొడుగుల ఊరేగింపులో కానుకలు ఇవ్వకండి

- భక్తులకు టీటీడీ సూచన

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవనాడు అలంకరించేందుకు చెన్నై నుంచి తిరుమలకు చేరుకునే గొడుగుల ఊరేగింపులో భక్తులు ఎలాంటి కానుకలు ఇవ్వద్దని టీటీడీ కోరింది. భక్తులు అందించే ఈ కానుకలు టీటీడీకి చేరవని స్పష్టం చేసింది. బ్రహ్మోత్సవాల సమయంలో హిందూ సంస్థలు చెన్నై నుంచి గొడుగులను ఊరేగింపుగా తిరుమలకు తీసుకువచ్చి స్వామికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ గొడుగులు 27వ తేదీన తిరుమలకు చేరుకుంటాయని టీటీడీ పేర్కొంది.

ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం

- ఒకరి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద జీనోజ్ అనే వ్యక్తి అదుపులోకి తీసుకుని, 1.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ రమణ తెలిపారు.ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. కేరళ రాష్ట్రం కాలింగాల్ జిల్లాకు చెందిన ఆర్.జీనోజ్ ఈనెల 20వ తేదీన ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వెంకటగిరి రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో నిఘా పెట్టామన్నారు. వెంకటగిరి రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చిన జీనోజ్ కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద 1.5కిలోల గంజాయి లభ్యమైందని సీఐ తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.



శివప్రసాద్‌కు నివాళి అర్పిస్తున్న ప్రీతమ్

శివప్రసాద్‌కు ఘన నివాళి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ ఎంపీ దివంగత డాక్టర్ నారమల్లి శివప్రసాద్ ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన మనవడు, పీఎం గ్రూప్ అధినేత కేతన్ శివప్రీతమ్ నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులతో కలసి అగరాలలోని శివప్రసాద్ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, టీటీడీబోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి

సృజనాత్మకతకు అద్దంపట్టిన కళాంగిని వేడుక

- ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల పాటు జరిగిన కళాంగిని వేడుక ఔత్సాహిక విద్యార్థులు, సీనియర్ ఆర్టిస్టుల సృజనాత్మకతకు అద్దం పట్టాయని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడులోని తిరుపతి ఐఐటీలో ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కళాంగిని వేడుక పేరిట శనివారం ఆర్ట్ వర్క్‌షాప్ నిర్వహించగా ఆదివారం ఆర్ట్ ఎగ్జిబిషన్ జరిగింది. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీటెక్, ఎంటెక్ రీసెర్చ్ వంటి కోర్సులతో నిత్యం బిజీగా ఉండే ఐఐటీ విద్యార్థులు ఆర్ట్ క్లబ్ తరఫున ఇలాంటి కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. రోజువారి చదువుల ఒత్తిడి నుంచి ఈ తరహా కార్యక్రమాలు మానసిక ఉపశమనం కలిగిస్తాయన్నారు. ఇదొక ఆట విడుపు మాత్రమే కాకుండా విద్యార్థుల్లోని ప్రతిభను, సృతజనాత్మకతను వెలికి తీస్తుందన్నారు. దీనికి ఐఐటీతో పాటు ఐసర్ విద్యార్థులు పాల్గొనడం మంచి పరిణామమన్నారు. తిరుపతి నుంచి సీనియర్ మహిళ ఆర్టిస్టులు వర్క్‌షాప్‌లో పాల్గొని ఐఐటీ, ఐసర్ విద్యార్థులకు వివిధ రకాల పెయింటింగ్‌లో శిక్షణ ఇచ్చారన్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఔత్సాహిక విద్యార్థుల కళారూపాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ తరహా కార్యక్రమాలను తరచూ నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.కృష్ణకుమార్, డీన్ ఎస్ఎన్ మూర్తి, పీఆర్వో చమన్ మెహతా, ఆర్టిస్టులు అర్చన, గాయత్రిదేవి, శ్రీదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కరువు సీమలో ఖర్జూరం సాగు

- ఓ రైతు విజయం



శ్రీరంగరాజపురం,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరువు సీమలో ఖర్జూరం సాగు చేసి విజయం సాధించారో రైతు. వినూత్న పంథాలో లాభాలు ఆర్జించారీయన. ఎస్‌ఆర్‌పురం మండలం పెద్ద తయ్యూరుకు చెందిన భాస్కర్ నాయుడు సాగు విషయంలో భిన్నంగా ఆలోచించారు. రొటీను పంటలు కాకుండా సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. 2016లో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి పక్కన తనకున్న రెండు ఎకరాల పొలంలో ఖర్జూరం సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం గుజరాత్ వెళ్లారు. అక్కడి సాగు పరిస్థితులను తెలుసుకున్నారు. బరిహి అనే ఖర్జూరపు రకానికి చెందిన 150 మొక్కలు ఇక్కడకు తీసుకువచ్చారు. మొక్క రూ.3,500 వంతున కొనుగోలు చేశారు. ప్రస్తుతం మొక్క ధర రూ.5వేలు పలుకుతోంది. పొలంలో వీటిని నాటాక ఇందుకు అవసరమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించారు. నీటి సమస్య తలెత్తకుండా బోరు వేయించారు.

సుమారు రూ.8లక్షల వరకు ఖర్చు

ఇప్పటివరకు సుమారు ఎనిమిది లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు భాస్కర్ నాయుడు తెలిపారు. రెండేళ్ల నుంచి పంట దిగుబడి వస్తోందన్నారు. ఈ ఏడాది రూ.8లక్షలు వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. పంట ఉత్పత్తిలో ఎక్కువ భాగం బెంగళూరులో విక్రయిస్తున్నట్లు చెప్పారు. కొంత ఇక్కడే ప్రాసెస్ చేసి అమ్ముతున్నామన్నారు. ఈ పంటకు వేడి, పొడినేల అనుకూలమని.. అది కూడా తనకు కలిసొచ్చిందని వివరించారు.సాగు నీరు నిల్వ ఉండని, ఇసుకతో కూడిన లోతయిన నేల సాగుకు ఉపయుక్తంగా ఉంటుందని, సాధారణంగా మొక్కల వయసు పెరిగే కొద్దీ దిగుబడి బాగుంటుందన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడి అవసరమైన పంట కావడంతో ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపించడం లేదని చెప్పుకొచ్చారు.

లాభదాయకమైన పంట

మొదటి కోత కోసే సమయానికి మొక్క వయసు మూడు నుంచి ఐదేళ్ల ఉంటుందని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. ఈలోగా వ్యయం ఎక్కువైనా దిగుబడి రైతుకు తోడ్పాటునిస్తుందని, లాభదాయకమైన పంట అని తెలిపారు.



రైతు భాస్కర్ నాయుడు



పొలాల వద్ద చిరుత పాద ముద్రలు

రామవనం నగరి వద్ద చిరుత సంచారం

- భయాందోళనలో స్థానికులు
- ఎవ్వరూ అడవిలోకి వెళ్లొద్దు: డీఆర్వో



చిరుత ఉన్న తోక బండ ప్రాంతం

ఐరాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐరాల తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోని రామవనం నగరి వద్ద ఉన్న అటవీ ప్రాంతంలో ఓ చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు చిరుత తన సంతానంతో గ్రామానికి సమీపంలోని పంట పొలాల వద్ద నుంచి చిత్తూరు-ఐరాల రోడ్డును దాటుకుని ఎదురుగా ఉన్న పెద్ద కొండలోని తోకబండ ప్రాంతంలోనికి వెళ్లినట్లు గుర్తించారు. చితరు సంచారం తెలుసుకున్న స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఎవ్వరూ అడవిలోకి వెళ్లొద్దని అటవీశాఖ డీఆర్వో రాకేష్‌కుమార్ హెచ్చరించారు. ముఖ్యంగా పశువుల కాపరులు కొండప్రాంతం వైపు వెళ్లొద్దన్నారు. అలాగే రాత్రి సమయంలో చిత్తూరుకు పనులపై వెళ్లి ద్విచక్రవాహనంలో వచ్చేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత సంచారంపై సమాచారం ఉంటే వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. త్వరలోనే చిరుతను పట్టుకుంటామని తెలిపారు.

మూడు మందలుగా విడిపోయి పంటలపై గజదాడులు

- వరి, అరటి, కొబ్బరి, మామిడి పంటలకు అపార నష్టం
- జూపల్లె వద్ద అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన డీఎఫ్‌వో సుబ్బరాజు



పంటలపై ఏనుగుల దాడులను తెలుసుకుంటున్న సుబ్బరాజు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజదాడులు ఆగడం లేదు. నిన్నటి వరకు ఒకే మందగా ఉన్న 16 ఏనుగులు శుక్రవారం రాత్రి మూడు మందలుగా విడిపోయి పంటలను ధ్వంసం చేయడం మొదలుపెట్టాయి. శనివారం పగలంతా అటవీ ప్రాంతంలో తిష్ఠవేసి, రాత్రి కాగానే పంటలపై పడ్డాయి. వరి, కొబ్బరి, మామిడి, అరటి పంటలకు అపారనష్టం వాటిల్లింది. శనివారం రాత్రి పులిచెర్ల మండలం సరిహద్దులోని తిరుపతి జిల్లా అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయల్దేరిన ఐదు ఏనుగుల మంద దిగుమూర్తివారిపల్లె మీదుగా దేవళంపేట వద్దకు చేరుకున్నాయి. సుధాకర్, ప్రభాకర్‌కు చెందిన వరిపంటను తొక్కేసి, చిన్ననగరి వద్దకు చేరుకుని రెడ్డెప్పకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడినుంచి మిట్టమదరాచపల్లె సమీపంలోని భాస్కర్, బాషూజి, బసవయ్య, శ్రీకాంత్, శ్రీరాములు, సిద్దయ్యకు చెందిన వరిపంటను నాశనం చేశాయి. తర్వాత అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగులు చింతలవంక వద్దకు చేరుకున్నాయి. మరోవైపు ఇదే అటవీ ప్రాంతం నుంచి బయల్దేరిన జంట ఏనుగులు పాళెం పంచాయతీలోకి చొరబడ్డాయి. సయ్యద్‌బాషా, రత్నాకర్‌నాయుడు, దామోదర్‌నాయుడు, సుబ్బరత్న, కళావతమ్మకు చెందిన వరి, మామిడి, పశుగ్రాసంను ధ్వంసం చేశాయి. తర్వాత అడవిలోని చింతలవంక వద్దకు చేరుకున్నాయి. ఇంకోవైపున పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయల్దేరిన తొమ్మిది ఏనుగుల మంద రిలయన్స్ టవర్ మీదుగా ఎద్దులవారిపల్లె వద్దకు చేరుకుని ఇక్బాల్‌కు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. తర్వాత మార్కొండయ్య, గురప్ప, ప్రసాద్, బాలకృష్ణ, నడిపన్న, బాలచంద్రకు చెందిన వరి, అరటి పంటలు, నీటి పైపులను ధ్వంసం చేసుకుంటూ తలారివారిపల్లె, పాతపేట, పూరేడువారిపల్లె, గౌరిశెట్టివారిపల్లె, ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె, చొక్కావారిపల్లె, చల్లావారిపల్లె మీదుగా తిరిగి గోగులమ్మ వంక వద్దకు చేరుకున్నట్లు స్థానికులు తెలిపారు.

సమన్వయంతో దాడులను అరికట్టాలి : డీఎఫ్‌వో

'తూర్పు, పశ్చిమ విభాగం అటవీ ప్రాంతమనే తేడాలు చూపకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ పంటలపై ఏనుగుల దాడులను అరికట్టాలి. అలాగే ఏనుగుల నుంచి ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకోవాలి' అని చిత్తూరు డీఎఫ్‌వో సుబ్బరాజు తెలిపారు. ఈ సందర్భంగా పులిచెర్ల మండలంలోని పాళెం పంచాయతీ జూపల్లె సమీపంలోని అడవిలో ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాలను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. మండలంలోకి ఏనుగులు ఎప్పుడు ప్రవేశించాయి, పంటలపై జరిగిన దాడులు, డ్రోన్ సాయంతో అడవిలో ఏనుగుల గుర్తింపు తదితర వివరాలను తూర్పు విభాగం ఎఫ్‌ఆర్‌వో థామస్ సుకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవోలు కృష్ణమూర్తి, మధు, ట్రాకర్లు పాల్గొన్నారు.

పరకామణి చోరీపై ఎందుకు విచారణ జరిపించలేదు?

తిరుపతి, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): మీ హయాంలో తప్పు జరిగినపుడు ఎందుకు విచారణ జరిపించలేదని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన టీడీపీ నేతలతో కలిసి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. పరకామణిలో ఒక మతం తరఫున పనిచేస్తున్న రవికుమార్‌తో చేతులు కలిపి ఎన్ని కోట్లు నొక్కేశారనేది బయట పెడతామన్నారు. లక్షల కోట్లు కాజేసి బినామీ పేర్లకు బదిలీ చేసి కల్లబొల్లి కబుర్లు చెప్పడం మానుకోవాలని సూచించారు. రవికుమార్‌తో చేసుకున్న మధ్యవర్తిత్వంతో కొన్ని ఆస్తులను తీసుకుని మరికొన్నింటిని మీ బినామీల మీదకు మార్చారంటూ శాప్ చైర్మన్ రవినాయుడు ఆరోపించారు. చంద్రగిరిలోని డోర్నకంబాల దగ్గర 8 ఎకరాలను ఎవరి పేరుమీదకు మార్చారో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి చెప్పాలన్నారు. మర్డర్లు, మానభంగాలు చేసినవారందరూ పశ్చాత్తాపపడితే వదిలేయమని మీ వైసీపీ చట్టాల్లో ఉందా అని ప్రశ్నించారు. 'టీటీడీ అంటే నీ జెరాక్స్ సెంటర్ అనుకుంటున్నావా? దోచుకున్నవారితో సెటిల్మెంట్లు చేయడమేంటి? నీ ఆస్తులన్నీ టీటీడీలో దొంగిలించినవే. ఆ దేవుడు విడిచిపెట్టడు' అని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ వ్యాఖ్యానించారు. పరకామణి కుంభకోణంలో దొంగలను లోక్ అదాలత్ ద్వారా విడిచిపెట్టడం టీటీడీ చరిత్రలో ఒక బ్లాక్ డేగా మిగిలిపోతుందని ఏపీయూఎఫ్ ఐడీసీ డైరెక్టర్ ఊకా విజయకుమార్ పేర్కొన్నారు. ఈ సంఘటనలో వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, కరుణాకర్ రెడ్డి, అప్పటి తిరుమల సీఐ జగన్ మోహన్‌రెడ్డి హస్తం ఉందన్నారు. రవికుమార్‌కు చెందిన రూ.15 కోట్ల ఆస్తులు.. అతడికి సన్నిహితుడైన చంద్రగిరిలోని జయచంద్రారెడ్డి పేరు మీద ఉన్నాయని, అతడే మధ్యవర్తిత్వంలో ఉన్నాడని పేర్కొన్నారు. దేవుడిని అడ్డం పెట్టుకుని అసత్యప్రచారాలు చేస్తే ఊరుకోబోమని నాయిబ్రాహ్మణ చైర్మన్ రుద్రకోటి హెచ్చరించారు. ఈ సమావేశంలో తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం చైర్మన్ నైనారు మహేష్ యాదవ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర తదితరులు పాల్గొన్నారు.



హామీల అమలు కోసం ఉద్యమిస్తాం: విఠపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

కోట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కూటమి ఇచ్చిన హామీల అమలు కోసం కలసికట్టుగా ఉద్యమిద్దామని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. కోటలోని రెడ్డికల్యాణ మండపంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటి అమలు కోసం ఉద్యమబాట పడుతామన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులపై యాప్‌ల పనిభారం పెంచుతున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కోటేశ్వరరావు, రాజశేఖర్, మువ్వల మనోహర్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోటలో జెండా ఉత్సవం



గూడలిలో ఆంజనేయస్వామి జెండాల ఊరేగింపు

కోట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి, శ్యామసుందరపురం, వెంకన్నపాళెం, తిన్నెలపూడి గ్రామాల్లో ఆదివారం జెండా ఉత్సవాలు జరిగాయి. ఆయా గ్రామాల్లో ఆంజనేయస్వామి జెండా, చిత్రపటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తిన్నెలపూడిలో చిన్నారులచేత కోలాటాలు ఆడించారు.

ముక్కంటి ఆలయ చైర్మన్‌కు అభినందనలు



సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా నియమితులైన కొట్టే సాయిప్రసాద్‌కు సూళ్లూరుపేట జనసేన నాయకులు అభినందనలు తెలిపారు. జనసేన మండల అధ్యక్షుడు ఆవుల రమణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు షేక్ మా భాషా, ఆవుల దాసు, రామగిరి రేవంత్, చేని సూరి, శంఖు సురేష్, మహిళా నాయకురాలు పద్మజ, సుజాత ఆదివారం సాయిప్రసాద్‌ను కలిసి సత్కరించారు.

స్వర్ణముఖినదిలో గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం

పెళ్లకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినదిలో గల్లంతైన చమర్తి పాపయ్య(65) మృతదేహం ఆదివారం లభ్యమైంది. మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన పాపయ్య శనివారం సాయంత్రం స్వర్ణముఖినదిని దాటుతుండగా గల్లంతయ్యాడు. శనివారం సాయంత్రం చీకటిపడే వరకు ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి రెస్క్యూ టీమ్‌తో కలిసి బోటులో గాలించగా సాయంత్రం దిరసనమాల సమీపంలో మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తెలిపారు.

మానసిక వికాసం కోసం విజ్ఞాన తరగతులు

పెళ్లకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందించడానికి విజ్ఞాన తరగతులు నిర్వహించనున్నట్లు విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పెనల మస్తాన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రం, విశ్వమానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయిఫూలే శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇందులో విద్యార్థుల్లో మానసిక వికాసంతో పాటు శారీరక ఆరోగ్యం పెంపొందించడానికి క్రీడలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లారపు నాగర్జున, డాక్టర్ టీ.రవీంద్రకుమార్, డీ.ప్రభాకర్, వెంకయ్య, పురిణి కృష్ణ పాల్గొన్నారు.

కాళంగి వంతెనపై వాహనాల రాకపోకల నిషేధం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న కాళంగి వంతెనపై వాహనాల రాకపోకలు నిషేధమని సీఐ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వంతెన బలహీనంగా ఉన్న నేపథ్యంలో భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు కంపెనీలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు, ట్రావెల్స్ యజమానులకు ఆదేశిచ్చామన్నారు. సోమవారం నుంచి కాళంగి వంతెనపై భారీ వాహనాలు వెళ్లితే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా ఆలయ సమీపంలో వాహనాలు పార్కింగ్ చేసినా చర్యలు తీసుకుంటామన్నారు.

బీజేపీ నాయకుల రక్తదానం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 17నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో బీజేపీ నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరణి విజయభాస్కర్ రెడ్డి, చెన్నకేశవులు, తన్నీరు శేషగిరిరావు, నూతపాటి శ్రీనివాసులు, కరుణాకర్‌రెడ్డి, తేజ, కోటయ్య గౌడ్, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఆదినారాయణరెడ్డి, సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బెజవాడ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభయ శంకరుడి ఆలయంలో అన్నదానం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య సందర్భంగా ఆదివారం టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడి ఆలయంలో అన్నదానం చేశారు. అభయ శంకరుడికి అభిషేకాలు చేసి పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్లను బాగు చేయండి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో రోడ్లను బాగు చేయాలంటూ స్థానికులు, ప్రజాసంఘాల నాయకులు, సీపీఎం నేతలు నిరసన తెలిపారు. పట్టణంలోని పొగగొట్టంకాలనీ, అమరాగార్డెన్, అగ్రహారపేట, ట్రెజరీ వీధుల్లో గుంతలు ఏర్పడి రాకపోకలు సాగించడానాకి అవస్థలు పడుతున్నారని స్థానికులు చెప్పారు. వర్షాకాలంలో విద్యార్థులు పాఠశాలకు వెళ్లి రావాలన్నా ఇబ్బందులు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతుల పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజాసంఘ నాయకులు ముకుంద, విజయమ్మ, సుబ్బరత్నమ్మ, అజ్మ, హుస్సేనమ్మ, కరీముల్లా, గోవిందమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుంతల వద్ద స్థానికులు, ప్రజాసంఘాలు, సీపీఎం నేతల నిరసన

అన్నపూర్ణాదేవి ఆలయంలో మహాలయ అమావాస్య పూజలు

తడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం మాంబట్టులో ఉన్న కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి విశేష పూజలు, సహస్రనామార్చన, గోపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నపూర్ణాదేవి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి సిమ్స్ వైద్యుడు మునస్వామి, టీడీపీ నాయకులు వేనాటి రాజారెడ్డి, సురేష్‌రెడ్డి, సర్పంచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మూకాంబికాదేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

నాయుడుపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూకాంబికాదేవి ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 22వ తేదీ సోమవారం మూకాంభికాదేవి అలంకరణ, 23న బాలత్రిపురసుందరిదేవి, 24న పార్వతీదేవి, 25న గాయత్రిదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న అన్నపూర్ణాదేవి, 28న శ్రీలలితా త్రిపురసుందరిదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1వ తేదీన మహిషాపుర మర్దినిదేవి, 2వ తేదీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో మూకాంబికాదేవి దర్శనమివ్వనున్నారు.

నేటి నుంచి నాగేశ్వరస్వామి ఆలయంలో...

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గంగా పార్వతీ త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పాలకమండలి సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ అందరి సహకారంలో ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా 22న పార్వతీదేవి అలంకారం, 23న అన్నపూర్ణాదేవి అలంకారం, 24న రాజరాజేశ్వరి, 25న గాయత్రిదేవి, 26న బాలత్రిపుర సుందరి, 27న మోహిని దేవి, 28న విజయలక్ష్మీ దేవి, 29న సరస్వతి దేవి, 30న మహిషాసురమర్ధని, అక్టోబరు 1న చండీదేవి అలంకారం, 2న చివరిరోజు పార్వతీ పరమేశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సునీల్ శర్మ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

అధిక ధరలకు స్టాంప్ పేపర్లు

నాయుడుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ స్టాంప్ పేపర్లను కొంత మంది వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారని బీజేపీ మండల కార్యదర్శి సురేంద్రబాబు ఆదివారం ఆరోపించారు. రాజగోపాలపురంలోని ఓ వెండర్ రూ.20 స్టాంప్ పేపరును రూ.50కి అమ్ముతున్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పలేదన్నారు. ఈ విషయమై జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సురేంద్రబాబు చెప్పారు.

ఎస్సీ వర్గీకరణను కలసికట్టుగా వ్యతిరేకిద్దాం



రౌండ్‌టెబుల్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, బహుజన ఐక్యవేదిక, జేఏసీ నాయకులు

కోట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను కలసికట్టుగా వ్యతిరేకిద్దామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర నాయకులు మీజూరు మాధవ్, దాసరి సుందరం పిలుపునిచ్చారు. కోటలోని రెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం మాలల జేఏసీ, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, బహుజన ఐక్యవేదిక నాయకులు భవిష్యత్తు ప్రణాళికపై రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవాన్ని కోటలో ఘనంగా నిర్వహిస్తామని, ఈ బహిరంగ సభకు తిరుపతి, ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి వేలాదిగా మాల సోదరులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మాలల జేఏసీ, ఐక్యవేదిక నాయకులు శ్రీనివాసరావు, హేమంత్, మల్లికార్జునరావు, మాలల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

కోట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో ఆదివారం పొలం విషయమై రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లు, మహేంద్రపై అదే గ్రామానికి చెందిన చలపతి, నీలగిరి ఇనుపరాడ్‌తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరాటే పోటీల్లో నిహాల్ ప్రతిభ



జ్ఞాపికతో నిహాల్ మనోహర్

కోట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రగతి విద్యాసంస్థల్లో 4వ తరగతి చదువుతున్న నిహాల్ మనోహర్ జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపాడు. ఆదివారం నెల్లూరులోని సోమిశెట్టి కల్యాణ మండపంలో జాతీయస్థాయి కరాటే పోటీలు జరిగాయి. ఇందులో నిహాల్ మనోహర్ క్యాంస పతకం సాధించాడు. నిహాల్ మనోహర్‌ను ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్, కరాటే మాస్టర్ హరిబాబు అభినం దించారు.

వైసీపీ జిల్లా కమిటీలో కోళ్లపూడికి చోటు

డక్కిలి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా బీసీ విభాగ కమిటీ సభ్యుడిగా డక్కిలికి చెందిన కోళ్లపూడి వేణుగోపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్ఠానం ఆదివారం ప్రకటించింది. కొళ్లపూడి వేణుగోపాల్ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డికి ముఖ్య అనుచరుడు.

శ్మశాన భూమి ఆక్రమణపై ఫిర్యాదు

బాలాయపల్లి, సెప్టెంబరు 21: మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో దళితుల శ్మశాన భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు ఆదివారం ఎక్స్‌వేటర్‌తో చదును చేస్తుండగా దళితులు అడ్డుకున్నారు. ఆక్రణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి శ్మశానానికి హద్దులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.



కోనేటిమిట్టలో ఆంజనేయస్వామి జెండాకు వీధోత్సవం నిర్వహిస్తున్న భక్తులు - ఉత్సవంలో కోలాటాలు

కోలాహలంగా జెండా ఉత్సవాలు

గూడూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలో ఆదివారం ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలను కోలాహలంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి జెండాకు పూజలు నిర్వహించి వీధుల్లో మోస్తూ తప్పెట్లు, తాళాల మధ్య భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం ఆలయాల వద్ద జెండాను ప్రతిష్ఠించారు. రాత్రి తప్పెట్లు, తాళాలు, తెనాలి బ్యాండు, తీన్‌మార్, కేరళవాయిద్యాలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. ప్రధానంగా గమళ్లపాళెం, తూర్పువీధి, కరణాలవీధి, మిట్టపాళెం, కోనేటిమిట్ట, కుమ్మరివీధి, అళఘునాథ స్వామి దేవస్థానం, సత్రపువీధి, నల జాలమ్మవీధి, వీరారెడ్డిపల్లి, తిలక్‌నగర్‌సెంటర్, ఇందిరానగర్, అశోక్‌నగర్, నరసింగరావుపేట, అడివయ్య కాలనీ, సిరామిక్ సెంటర్, మాళవ్యానగర్, ఐసీఎస్ రోడ్డు, రాజరాజేశ్వరీదేవి ఆలయంవీధి, అరుంధతీయనగర్ తదితర ప్రాంతాలలో జెండా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. యువత చిందులతో సందడి చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అల్లర్లు జరుగకుండా డీఎస్పీ గీతాకుమారి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జెండా ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి బంధు మిత్రులు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే స్థానికులు, సమీప గ్రామాల ప్రజలు తరలిరావడంతో గూడూరు పట్టణంలో సందడిగా మారింది.

నేడు కలశ స్థాపనతో శరన్నవరాత్రులు ప్రారంభం

పట్టణంలో వివిధ అమ్మవారి ఆలయాల్లో సోమవారం కలశ స్థాపనతో శరన్నవరాత్రులను ప్రారంభించనున్నారు. విజయదుర్గాదేవి ఉపపీఠం, నారాయణమ్మ పేరంటాళ్లు, మహాలక్ష్మమ్మ, కన్యకాపరమేశ్వరి, రాజరాజేశ్వరి, గంగమ్మ ఆలయం, మాళవ్యనగర్ మహాలక్ష్మమ్మ, ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామి, బజారువీధిల్లోని ఆలయాల్లో కలశ స్థాపనకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



జెండా గ్రామోత్సవం ఎదుట తెనాలి బ్యాండు వాయిద్యాలు - ఆదిదేవ, అంధకాసుర వధ ఘట్టం నాటిక ప్రదర్శన సెట్టింగ్

పట్రాంగం ఆలయ నిధుల స్వాహాపై విచారణ

వాకాడు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పంట్రాంగం గ్రామంలోని పాండురంగేశ్వర, రామలింగేశ్వర ఆలయ నిధులు స్వాహాకు గురైనట్లు ఆరోపణలు రావడంతో ఆదివారం దేవదాయశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. పంట్రాంగం ఆలయ భూములు కౌలు వేలం ద్వారా వచ్చిన రూ.17 లక్షల సొమ్మును ఆలయ ఈవో స్వాహా చేసినట్లు ఆరోపణలు రావడంతో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి విచారణ చేపట్టారు. రికార్డులు స్వాధీనం చేసుకున్నారన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న దేవదాయశాఖ అధికారులు

దివ్యాంగులకు కూరగాయలు



దివ్యాంగులకు కూరగాయలు అందజేస్తున్న జేవీవీ సభ్యులు

గూడూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విజయబాబు దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడి గుడ్లు పంపిణీ చేశారు. జేవీవీ పట్టణాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, సుబ్బారావు, ఆనంద్, రామ్మోహన్, గోపి, జగదీష్, ఇబ్రహీం, సుధీర్, శర్మ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.